ఆదివారం
14-07-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 23
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఆసుపత్రి నుంచి రాజ్‌నాథ్ సింగ్ డిశ్చార్జ్

న్యూఢిల్లీ: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. తీవ్రమైన వెన్ను నొప్పితో రెండు రోజుల క్రితం ఆయన దిల్లీ ఎయిమ్స్‌లో చేరిన విషయం తెలిసిందే.

అప్పటి నుంచి చికిత్స పొందిన రాజ్‌నాథ్ సింగ్... శనివారం డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లినట్లు ఎయిమ్స్ వైద్యులు తెలిపారు. వెన్ను నొప్పితో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం ఓల్డ్ ప్రైవేట్ వార్డ్‌లోని న్యూరో సర్జరీ డిపార్ట్‌మెంట్‌లో చేరారు. అప్పటి నుంచి వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నారు. రెండు రోజుల చికిత్స అనంతరం ఆరోగ్యం కుదుట పడటంతో రాజ్‌నాథ్ సింగ్‌ను వైద్యులు డిశ్చార్జ్ చేశారు.

జమ్మూకశ్మీర్ ఎల్జీకి మరిన్ని అధికారాలు ← 2 లో → జమ్మూకశ్మీర్‌కు మోదీ మోసం: ఖర్గే

అలసత్వం వద్దు

- అధికారం అహంకారం కాదు...
- పార్టీ కార్యాలయానికి రావడాన్ని మంత్రులు సేవగా భావించాలి
- పార్టీ శ్రేణులకు సీఎం చంద్రబాబు మార్గనిర్దేశనం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అధికారంలోకి వచ్చేశామన్న అలసత్వాన్ని విడనాడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, ఎమ్మెల్యేలకు సూచించారు. టీడీపీ కేంద్ర కార్యాలయమైన ఎన్టీఆర్ భవన్‌లో ఆయన శనివారం ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రులు కూడా పార్టీ కార్యాలయానికి తరచూ రావడం సేవగా భావించాలని, రోజూ కనీసం ఇద్దరు మంత్రులైనా వచ్చి కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని కోరారు. వారిని పార్టీ కార్యాలయానికి తీసుకొచ్చే బాధ్యత జోనల్ ఇన్‌ఛార్జులు తీసుకోవాలని, ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారాన్ని మంత్రులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. వినతుల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుతో పాటు ఇందుకోసం ప్రత్యేక కమిటీ కూడా ఏర్పాటు చేస్తానని తెలిపారు. పార్టీ నేతలెవరూ వ్యక్తిగత దాడులు, కక్ష సాధింపులకు దిగొద్దు అని హెచ్చరించారు. వైసీపీ చేసిన తప్పులే మనం చేస్తే, వారికీ మనకు తేడా ఉండదని, తప్పు చేసిన వారిని చట్టపరంగానే శిక్షిద్దామని చంద్రబాబు స్పష్టం చేశారు. గత ఐదేళ్లుగా టీడీపీ కార్యకర్తలపై నమోదయిన అక్రమ కేసులను సీఎం ఆరా తీశారు. చట్టపరంగానే వారికి ఎలా విముక్తి కలిగించాలన్న దానిపై చర్చించారు. తమ

- మిగతా 2 లో

భారీగా ఐపీఎస్‌ల స్థానచలనం

37 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 37 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రఘువీరారెడ్డి, సిద్దార్థ్ కౌశల్, ఎస్.శ్రీధర్, సుమిత్ సునీల్, పి.జగదీశ్, సత్తిబాబు, రాధిక, మేరీ ప్రశాంతి, ఆరిఫ్ హఫీజ్‌ను డీజీపీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాల వారీగా పరిశీలిస్తే... శ్రీకాకుళం జిల్లా ఎస్పీగా కేవీ మహేశ్వర్‌రెడ్డి, విజయనగరం ఎస్పీగా వకుల్ జిందాల్, అనకాపల్లికి ఎం.దీపిక, సత్యసాయి జిల్లాకు వి.రత్న, పార్వతీపురం మన్యం జిల్లీ ఎస్పీగా ఎస్వీ మాధవరెడ్డి, కాకినాడ ఎస్పీగా విక్రాంత్ పాటిల్‌ను బదిలీ చేసింది. గుంటూరుకు ఎస్.సతీశ్ కుమార్, అల్లూరి జిల్లాకు అమిత్ బర్దార్, విశాఖ సిటీ డిప్యూటీ కమిషర్ 1గా అజిత వేజెండ్ల, విశాఖ సిటీ డిప్యూటీ కమిషర్ 2గా తుహిన్ సిన్హా, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీగా డి.నరసింహ కిషోర్, అన్నమయ్య జిల్లాకు వి.విద్యాసాగర్ నాయుడు, కోనసీమ జిల్లాకు బి.కృష్ణారావు, కృష్ణా ఎస్పీగా ఆర్.గంగాధర్‌రావు, పశ్చిమగోదావరి జిల్లాకు అద్నాన్ నయీమ్ ఆస్మీ, ఏలూరు జిల్లాకు కె.ప్రతాప్ శివకిశోర్, పల్నాడు జిల్లాకు

- మిగతా 2 లో

ఉపపోరులో 'ఇండియా' జోరు

- 10 అసెంబ్లీ సీట్లలో విజయం
- రెండు సీట్లకే బీజేపీ పరిమితం

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల తర్వాత అధికార, విపక్షాలకు తొలి పరీక్షగా భావించిన అసెంబ్లీల ఉపఎన్నికల్లో ఇండియా ఐక్యసంఘటన విజయకేతనం ఎగురవేసింది. దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లో విపక్ష కూటమి 10 చోట్ల అద్భుత విజయం సాధించింది. బీజేపీ కేవలం రెండు స్థానాలకు పరిమితమైంది. మరో చోట స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. పశ్చిమ బెంగాల్‌లో 4, హిమాచల్ ప్రదేశ్‌లో మూడు, ఉత్తరాఖండ్‌లో రెండు, పంజాబ్, బీహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్‌లో ఒక్కో స్థానానికి జులై 10న ఉపఎన్నిక పోలింగ్ జరిగింది. ఇందులో నాలుగు రాష్ట్రాల్లో ఇండియా కూటమి అధికారంలో ఉండగా... మరో మూడుచోట్ల ఎన్డీయే ప్రభుత్వం ఉంది. శనివారం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని దేహ్రాలో ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు సతీమణి, కాంగ్రెస్ అభ్యర్థి కమలేశ్ ఠాకూర్ విజయం సాధించారు. తన

- మిగతా 2 లో

సీపీఐ జాతీయ సమితి సమావేశాలు ప్రారంభం

న్యూఢిల్లీ: సీపీఐ జాతీయ సమితి సమావేశాలు దిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలు మూడు రోజులు జరుగుతాయి. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సమావేశాలు ప్రారంభించారు. దేశ రాజకీయ పరిణామాలను ఆయన వివరించారు. మోదీ సర్కారు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ఆవశ్యకతను ఆయన ఉద్ఘాటించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు, పార్టీ పనితీరును ఆయన విశ్లేషించారు. సమావేశాల్లో సీపీఐ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, అమర్‌జీత్ కౌర్, అజీజ్‌పాషా, రామకృష్ణ పాండా, కాంగో హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జాతీయ కార్యవర్గ సభ్యులు కె.రామకృష్ణ, రావుల వెంకయ్య, అక్కినేని వనజ, సమితి సభ్యులు జేవీ సత్యనారాయణ మూర్తి, ఓబులేసు, దుర్గాభవానీ, మధు, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు కొత్త మద్యం విధానం?

పాత పద్ధతిలోనే షాపులకు టెండర్ల ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నూతన మద్యం విధానానికి దస్త్రం సిద్ధమైంది. సోమ, మంగళవారాల్లో దీనిపై ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శిగా ముఖేష్ కుమార్ మీనా తాజాగా నియమితులయ్యారు. గతంలో అబ్కారీ కమిషనర్‌గా పనిచేసిన

- మిగతా 2 లో

ఆబ్కారీ, గనులశాఖ ముఖ్యకార్యదర్శిగా మీనా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారిగా పనిచేసిన సీనియర్ ఐఏఎస్ ముఖేష్ కుమార్ మీనాను అబ్కారీ, గనుల శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా ఉన్న మీనాను కేంద్ర ఎన్నికల సంఘం రిలీవ్ చేసింది. వెంటనే కీలక బాధ్యతలు అప్పగిస్తూ జీవో ఎంఎస్ నంబర్ 1250 జారీ

- మిగతా 2 లో

నేపాల్ ప్రధానిగా కేపీ ఓలీ

రేపు ప్రమాణ స్వీకారం - కొలువుతీరనున్న కొత్త కేబినెట్

2 లో

తొలగని కోవిడ్ ముప్పు

వారానికి 1700 మంది మృతి: డబ్ల్యూహెచ్ఓ

జెనీవా: ప్రపంచాన్ని కోవిడ్ మహమ్మారి వీడలేదు. ప్రాణాంతక వైరస్ ముప్పు తొలగిపోలేదు. నేటికీ దీని బారిన పడి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా వారానికి కనీసం 1700 మరణాలు కోవిడ్‌తో సంభవిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తెలిపింది. ఈ వ్యాధి నుంచి రక్షణ కోసం వాక్సిన్‌లు తీసుకోవాలని సూచించింది. వైరస్ నుంచి ఎక్కువగా ప్రమాదం ఉండే వర్గాలు అంటే వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని డబ్ల్యూహెచ్ఓ పేర్కొంది. 'హెచ్5ఎన్1 వ్యాప్తిపై అధ్యయనాలు కొనసాగిస్తూనే కోవిడ్-19పైనా పరిశోధనలు జరుపుతూనే ఉన్నాం. ప్రపంచ దేశాల్లో ఈ వైరస్‌తో వారానికి 1700 మంది ప్రాణాలు కోల్పోయారు' అని విలేకరుల సమావేశంలో డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ ట్రెడోస్ అధానోమ్ ఘెబ్రేయేసెస్ అన్నారు. 60ఏళ్లు పడిన వారితో పాటు హెల్త్ వర్కర్లలో వాక్సిన్ కవరేజి తగ్గిందని డేటా చెబుతోందన్నారు. ఈ రెండు వర్గాలకు ముప్పు ఎక్కువని, చివరి డోసు తీసుకున్న 12 నెలల లోపు కోవిడ్-19 వాక్సిన్ తీసుకోవాలని డబ్ల్యూహెచ్ఓ సూచిస్తోందని ట్రెడోస్ తెలిపారు. కోవిడ్-19 ప్రాణాంతక పరిస్థితి ముగిసిందని 2023, మేలో డబ్ల్యూహెచ్ఓ ప్రకటించింది. 2019 చివరిలో చైనాలోని వుహాన్ నుంచి ఈ వైరస్ వ్యాప్తి చెందింది. మూడేళ్ల పాటు ప్రపంచాన్ని గడగడలాడించింది. వైరస్ సర్వేయలెన్స్, సీక్వెనింగ్ కొనసాగించాలని ప్రపంచ దేశాలకు డబ్ల్యూహెచ్ఓ సూచనలు చేసింది. టెస్ట్, ట్రీట్మెంట్, వాక్సినేషన్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని పేర్కొంది.

నైజీరియాలో కూలిన స్కూలు భవనం

22 మంది విద్యార్థుల మృతి

అబూజ: తరగతులు జరుగుతుండగా ఓ స్కూలు భవనం కుప్పకూలిన ఘటన నైజీరియాలోని ప్లాట్యూ రాష్ట్రంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో 22 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోగా అనేకమంది గాయపడ్డారు. గాయపడిన విద్యార్థులకు వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న సుమారు 100 మందిని సురక్షితంగా కాపాడినట్లు అధికారులు తెలిపారు. కట్టడం బలహీనంగా ఉండటం వల్ల ఈ ప్రమాదం జరిగిందని ప్లాట్యూ ప్రభుత్వం పేర్కొంది. ఈ తరహా పరిస్థితుల్లో ఉన్న స్కూళ్లను మూసివేయాలని ఆదేశాలు జారీచేసింది. నది తీర ప్రాంతంలో ఉన్నందున స్కూలు భవనం బలహీనమై ఉంటుందని వెల్లడించింది. అయితే చనిపోయిన విద్యార్థులంతా 15ఏళ్ల లోపు వారేనని అధికారులు తెలిపారు. తొలుత 150 మంది పిల్లలు శిథిలాల కింద చిక్కుకుపోగా వారిలో 132 మందిని సురక్షితంగా బయటకు తీసినట్లు వెల్లడించారు.

ఘటన జరిగినప్పుడు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకొని విద్యార్థులను కాపాడేందుకు ప్రయత్నించారన్నారు. తల్లిదండ్రుల రోదలతో ఆ ప్రాంతంలో విషాదం నెలకొన్నదన్నారు. తొలుత 12 మంది చనిపోయినట్లు తెలిపిన అధికారులు

అనంతరం 22 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్లు ప్రకటించారు.

ఆబ్కారీ, గనులశాఖ ముఖ్యకార్యదర్శిగా మీనా

(మొదటిపేజీ తరువాయి)

అయింది. 1998 బ్యాచ్‌కు చెందిన మీనా సమర్థ అధికారిగా గుర్తింపు పొందారు. సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారు. తన సర్వీసులో విభిన్న పదవులను అలంకరించారు. తనదైన శైలిలో పనిచేసి ప్రజల మన్ననలు అందుకున్నారు. నెల్లూరు, విశాఖలో అసిస్టెంట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో, కర్నూలు జాయింట్ కలెక్టర్, ప్రకాశం, కర్నూలు కలెక్టర్, సీఎస్ ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్, విశాఖపట్నం నగర పాలక సంస్థ కమిషనర్, క్రీడాభివృద్ధి సంస్థ ఎండీ, ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీగా వ్యవహరించారు. రాష్ట్ర విభజన సమయంలో హైదరాబాద్ కలెక్టర్, జీఏడీ కార్యదర్శి పదవులలో పనిచేశారు. పరిశ్రమలు (ఆహార శుద్ధి), అర్థిక (వాణిజ్య పన్నులు), చేనేత జౌళి శాఖ కార్యదర్శిగా, రాజ్‌భవన్ కార్యదర్శిగా, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా, పర్యాటక, భాషా, సాంస్కృతిక, పురావస్తు శాఖ కార్యదర్శిగా, రెండు పర్యాయాలు అబ్కారీ కమిషనర్‌గానూ విధులు నిర్వర్తించారు. గత ప్రభుత్వం అమలు చేసిన మద్యం, మైనింగ్ పాలసీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో వీటిని గాడిన పెట్టేందుకు మీనాకు మరలా కీలక బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

నేపాల్ ప్రధానిగా కేపీ ఓలీ

ఖాట్మండు: నేపాల్‌లో రాజకీయ అస్థిరత క్రమంలో ప్రచండ ప్రభుత్వం కుప్పకూలింది. విశ్వాస పరీక్షలో పుష్పకమల్ దహాల్ ఓటమిపాలయ్యారు. దీంతో హిమాలయ దేశానికి కొత్త ప్రధానిగా సీపీఎన్-యూఎంఎల్ పార్టీ చైర్మన్, మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ పగ్గాలు చేపట్టబోతున్నారు. ఇదే క్రమంలో సోమవారం ప్రమాణ స్వీకారం జరగనున్నది. కొత్త మంత్రివర్గం కూడా కొలువుదీరబోతోంది. ఆదివారం మధ్యాహ్నం ఓలీని కొత్త ప్రధానిగా అధ్యక్షుడు రామ్ చంద్ర పౌడెల్ నియమిస్తారు. 15వ తేదీ ఉదయం కొత్త ప్రధానితో పాటు కేబినెట్ మంత్రులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ప్రమాణ స్వీకారానికి ముందు మంత్రివర్గాన్ని ప్రకటించనున్నట్లు ఎన్‌సీ, యూఎంఎల్ వర్గాలు తెలిపాయి. ఓలీ శుక్రవారం సాయంత్రం శీతల్ నివాస్‌కు నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేర్ బహదూర్ డ్యూబా వెంట వెళ్లారు. యూఎంఎల్, ఎన్‌సీ కలిపి మొత్తం 166 ఎంపీల మద్దతు తనకున్నట్లు పత్రాలు సమర్పించారు. ప్రభుత్వం ఏర్పాటునకు అనుమతి కోరారు. ఇదే క్రమంలో శనివారం సీపీఎన్- యూఎంఎల్ ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. భవిష్యత్ కార్యాచరణను చర్చించారు. మంత్రులుగా ఎవరెవరిని చేర్చాలన్నది ఖారురు చేశారు. జాబితాను సిద్ధం చేశారు. కాగా, ప్రతినిధుల సభలో మెజారిటీ ఉన్నందున కొత్త ప్రధానిగా ఓలీని నియమించాలని అధ్యక్షుడికి ఓలీ, డ్యూబా సంయుక్తంగా దరఖాస్తు చేశారు. ప్రతినిధుల సభలో 77 మంది ఎంపీలతో రెండవ అతిపెద్ద పార్టీగా సీపీఎన్-యూఎంఎల్ ఉన్నది. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 138 మంది ఎంపీల మద్దతు ఉండాలి. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేంత వరకు ప్రధాని పదవిలో కొనసాగాలని ప్రచండకు అధ్యక్షుడు సూచించారు.

ఉపపోరులో 'ఇండియా' జోరు

(మొదటిపేజీ తరువాయి)

సమీప బీజేపీ అభ్యర్థిపై 9 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. నాలాగఢ్ స్థానంలో కాంగ్రెస్ నేత హర్‌దీప్ సింగ్ బవా 8,990 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థిపై విజయం సాధించారు. హమీర్‌పూర్ స్థానంలో బీజేపీ అభ్యర్థి ఆశీష్ శర్మ గెలుపొందారు. పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుపొంది జోరుమీదున్న తృణమూల్ కాంగ్రెస్... తాజా ఉప ఎన్నికల్లోనూ హవా కొనసాగించింది. ఇక్కడ రాయ్‌గంజ్, రాణాఘాట్, బాగ్దా, మాణిక్‌తలా స్థానాల్లో తృణమూల్ అభ్యర్థులు విజయ దుందుభి మోగించారు. ఉత్తరాఖండ్‌లో మంగళౌర్, బద్రీనాథ్ స్థానాలను కాంగ్రెస్ దక్కించుకుంది. పంజాబ్‌లోని జలంధర్ స్థానంలో ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి మోహిందర్ భగత్ విజయం సాధించారు. తన సమీప బీజేపీ అభ్యర్థి శీతల్‌పై 37 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. తమిళనాడులోని విక్రావండి స్థానంలో డీఎంకే అభ్యర్థి అన్నియూర్ శివ విజయం సాధించారు. మధ్యప్రదేశ్‌లోని అమర్‌వాడాలో బీజేపీ నేత కమలేశ్ షా గెలుపొందారు. బీహార్‌లోని రూపౌలి స్థానంలో స్వతంత్ర అభ్యర్థి శంక్ సింగ్ జయకేతనం ఎగురవేశారు. ఉప ఎన్నికలను అటు ఇండియా ఐక్యసంఘన, ఇటు ఎన్‌డీఏ కూటమి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. విస్తృత ప్రచారం చేశాయి. ఇప్పటికే సార్వత్రిక ఎన్నికల్లో చతికిల పడిన బీజేపీ...ఉప ఎన్నికల్లోనైనా పరువు నిలుపుకోవడానికి నానాతంటాలు పడింది. అయినా ఇండియా పార్టీలు ఐక్యంగా నిలిచి తమ అభ్యర్థుల విజయానికి దోహదపడ్డాయి. బీజేపీకి మరోసారి ఓటమి రుచిచూపించాయి.

తమిళనాడుకు కావేరీ జలాలు ఇవ్వలేం: సిద్ధరామయ్య

బెంగళూరు: వర్షాభావ పరిస్థితులకు తోడు జలాశయాల్లో నీటి మట్టం అడుగంటుతుండటంతో కావేరీ జలాల్ని తమిళనాడుకు విడుదల చేసే ప్రసక్తే లేదని కర్నాటక సీఎం సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ఇదే అంశంపై మాట్లాడటానికి ఆయన ఆదివారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కావేరీ వాటర్ రెగ్యులేటరీ కమిటీ జులై 31 వరకు తమిళనాడుకు రోజుకొక్క టీఎంసీ చొప్పున నీటిని విడుదల చేయాలని కర్నాటకను ఆదేశించింది. అయితే కన్నడ సర్కార్ నీటి విడుదలకు అంగీకరించట్లేదు. తమ నీటి అవసరాలు ఎక్కువగా ఉన్నట్లు సీడబ్ల్యూఆర్సీ ముందు చెప్పాలని సిద్ధరామయ్య నిర్ణయించారు.

అలసత్వం వద్దు

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలో నమోదయిన కేసుల వివరాలు నియోజకవర్గ ఇన్‌ఛార్జులు తక్షణమే కేంద్ర కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. సమర్థులందరికీ నామినేటెడ్ పదవులు దక్కుతాయని పార్టీ విజయం కోసం కృషి చేసిన నేతలకు మరోసారి భరోసా ఇచ్చారు. దీనికి ముందుగా ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి చంద్రబాబు వినతులు స్వీకరించారు.

పాపకు రూ.16 కోట్ల ఇంజక్షన్ కోసం సాయం కోరిన బాధితులు

గుంటూరుకు చెందిన వెచ్చా ప్రీతమ్ దంపతులు తమ పాప హితైషీను తీసుకువచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశారు. ఏడాది వయసున్న హితైషీ తీవ్రమైన వ్యాధితో బాధపడుతోంది. స్పైనల్ మసక్యులర్ అట్రోఫీ అనే ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న పాపకు చికిత్స కోసం వారు ముఖ్యమంత్రిని కలిశారు. పాపకు ఉన్న జబ్బు నయం కావాలి అంటే 'జోల్‌జెన్స్‌మా' అనే ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. దీని ధర రూ.16 కోట్లు కావడంతో తల్లిదండ్రులు సాయం కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే నిధుల సమీకరణ కార్యక్రమం కూడా చేపట్టారు. మరో నెల రోజుల్లో ఈ చికిత్స అందించాల్సి ఉందని తల్లిదండ్రులు ముఖ్యమంత్రికి తెలియజేయగా, దీనిపై వెంటనే పరిశీలన జరుపుతామని సీఎం వారికి హామీ ఇచ్చారు.

కాళ్లకు దండం పెట్టే విధానం విడనాడండి : చంద్రబాబు వినతి

ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నేతలు తన కాళ్లకు నమస్కారం చేసే పని చేయవద్దని సీఎం చంద్రబాబు కోరారు. ప్రజలతో కాళ్లకు నమస్కారం పెట్టించుకునే సంస్కృతి మంచిది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా కొందరు నేతలు కాళ్లపై పడి నమస్కరించడానికి ప్రయత్నించడంతో సీఎం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దీనిపై చంద్రబాబు బహిరంగ విజ్ఞప్తి చేశారు. ఎంత వారిస్తున్నా ప్రజలు, కార్యకర్తలు, నాయకులు కాళ్లకు నమస్కారాలు చేస్తున్నారని, ఇకపై ఇలా చేయవద్దని కోరారు. ఆత్మగౌరవంతో అంతా నడుచుకోవాలని, కాళ్లకు మొక్కే సంస్కృతి మంచి విధానం కాదని చంద్రబాబు తెలిపారు.

త్వరలో అన్నా క్యాంటీన్‌లు ప్రారంభం

ధర్మాన్ని కాపాడటానికి విశ్వాసాన్ని కలిగించే ధార్మిక సంస్థలు ఉండటం అందరి అదృష్టమని సీఎం చంద్రబాబు అన్నారు. తాడేపల్లి సమీపంలోని కొలనుకొండలో హరేకృష్ణ గోకుల క్షేత్రంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ అనంత శేషస్థాపన కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హరేకృష్ణ గోకుల క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రతిష్ఠాత్మక నిర్మాణం జరుగుతోంది. 216 అడుగుల ఎత్తున్న ప్రధాన గోపురంతో వెంకటేశ్వరస్వామి, రాధాకృష్ణ దేవాలయం నిర్మిస్తున్నారు. ఇది ఒక గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని చంద్రబాబు ఆకాంక్షించారు.

మధుపండిత్ దాస్ నేతృత్వంలో గతంలో అన్నా క్యాంటీన్‌లకు భోజన సరఫరా చేశారు. భోజన నాణ్యతలో ఒక్క చిన్న ఫిర్యాదు లేకుండా 203 అన్నా క్యాంటీన్లు నాడు నిర్వహించాం. కానీ గత ప్రభుత్వం వాటిని మూసేసింది. త్వరలోనే అన్నా క్యాంటీన్లు పున: ప్రారంభిస్తామని చంద్రబాబు ప్రకటించారు. మంచికి వచ్చే ఐదేళ్లు స్పీడ్ బ్రేకర్లు ఉండవు... మంచి చేసే వారికి పూర్తిగా సహకరిస్తామని హామీ ఇచ్చారు.

రేపు కొత్త మద్యం విధానం?

(మొదటిపేజీ తరువాయి)

అనుభవం ఆయనకు నూతన మద్యం విధానం అమలుకు ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వం అమలు చేసిన మద్యం విధానంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రభుత్వమే నేరుగా మద్యం షాపులు నిర్వహించడం, డిజిటల్ చెల్లింపులను తిరస్కరించడం, బ్రాండెడ్ మద్యం అందుబాటులో లేకుండా చేసి, వైసీపీ నేతలు తయారు చేసే సొంత బ్రాండ్‌లు అమ్మడం, పొరుగు రాష్ట్రాల కంటే అత్యధిక ధరలకు విక్రయించడం వంటి అంశాలపై విమర్శలు వచ్చాయి. సార్వత్రిక ఎన్నికల్లో కూడా ప్రతిపక్షాలు దీనిని ప్రచారాస్త్రంగా వాడాయి. గతంలో వలే దేశవ్యాప్తంగా మార్కెట్‌లో లభించే బ్రాండెడ్ మద్యాన్ని అందుబాటులోకి తేవడంతోపాటు, పాత పద్ధతిలో మద్యం షాపులకు టెండర్లు ఆహ్వానించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా 3,760 మద్యం షాపులకు టెండర్లు పిలవాల్సి ఉంటుందని అధికారులు ప్రాథమిక కసరత్తు పూర్తిచేశారు. జనాభా ఆధారంగా వీటి ధరలను నిర్ణయించనున్నారు.

భారీగా ఐపీఎస్‌లకు స్థానచలనం

(మొదటిపేజీ తరువాయి)

కె.శ్రీనివాసరావు, ఏపీఎస్పీ విజయనగరం బెటాలియన్ కమాండెంట్‌గా మల్లికాగార్గ్, ప్రకాశం జిల్లాకు ఏఆర్.దామోదర్, కర్నూలు జిల్లాకు జి.బిందు మాధవ్, నెల్లూరు జిల్లాకు జి.కృష్ణకాంత్, నంద్యాల జిల్లాకు అధిరాజ్‌సింగ్ రానా, కడప జిల్లాకు వి.హర్షవర్ధన్ రాజు, అనంతపురం జిల్లాకు కేవీ మురళీ కృష్ణ, బాపట్ల జిల్లాకు తుషారు దూడీని బదిలీ చేసింది.

తిరుపతి జిల్లా ఎస్పీగా ఎల్.సుబ్బారాయుడును బదిలీ చేసింది. అలాగే ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ పోలీస్ కమిషనర్‌గా (శాంతి భద్రతలు) గౌతమీ శాలి, ఇంటెలిజెన్స్ అడ్మిన్ ఎస్పీగా వి.గీతాదేవిని బదిలీ చేసింది.

'తల్లికి వందనం'పై వైసీపీ అబద్ధ ప్రచారాలు

మంత్రి నిమ్మల

విశాలాంధ్ర-విజయవాడ: విధి విధానాలు రూపొందించక ముందే తల్లికి వందనం మంగళం అంటూ వైసీపీ ప్రచారం చేయడం దుర్మార్గమని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరికి అమ్మఒడి అని చెప్పిన వైసీపీ అమ్మలను పిల్లలను మోసం చేసిందని విమర్శించారు. 2019 మేలో వైసీపీ అధికారం చేపట్టాక... 2020 వరకు కూడా అమ్మఒడిని అమలు చేయని వైసీపీకి కూటమిని ప్రశ్నించే అధికారం లేదన్నారు. వైసీపీ మాదిరిగా తమ ప్రభుత్వంలో ఎగ్గొట్టడాలు ఉండవని, ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తాం అని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని తెచ్చుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం అవుతుందని... చంద్రబాబు, పవన్ కల్యాణ్ దానికి అంగీకరించారని వక్రభాష్యాలు చెబుతూ అబద్ధాలు రాయడం దుర్మార్గం అన్నారు. కేంద్ర మంత్రి ప్రకటనలో వైసీపీది అబద్ధప్రచారం అని తేలిపోయిందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన పింఛన్ రూ.వెయ్యి ఐదు రోజుల్లోనే ఇంటికి తెచ్చి అందించిన ఘనత చంద్రబాబుది అన్నారు. రూ.వెయ్యి ఇవ్వడానికి జగన్ ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టిందన్నారు. ఉచిత ఇసుకపై ప్రచారం చేస్తున్న అసత్యాలను ప్రజలే తిప్పికొట్టారని చెప్పారు. రూ.14 లక్షల కోట్లు అప్పు పెట్టినప్పటికి ఖాజానాను ఖాళీగా ఉంచినప్పటికి ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేర్చుకుంటూ వస్తున్నాం అన్నారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మెరుగైన సూచనలు ఇవ్వాలిగాని ఇలాంటి అసత్య, అబద్ధపు ప్రచారాలు కొనసాగిస్తే జగన్‌ను శాశ్వతంగా రాజకీయాల నుంచి ప్రజలే దూరం చేస్తారని చెప్పారు. సాక్షి అబద్ధపు ప్రచారాలపై ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. తప్పుడు రాతలు మానుకోకుంటే ఈసారి జగన్ పార్టీకి డబుల్ డిజిట్ కూడా రాదని నిమ్మల ఎద్దేవా చేశారు.

బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ విలీనంపై

మోదీ సర్కారు వెనకడుగు

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ టెలికాం సంస్థలైన మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్ (ఎంటీఎన్ఎల్), భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) విలీనం విషయంలో కేంద్రం పునరాలోచనలో పడింది. విలీన అంశాన్ని పక్కనపెట్టి ఎంటీఎన్ఎల్ కార్యకలాపాలను బీఎస్ఎన్ఎల్‌కు అప్పగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనికి నెల సమయం పట్టవచ్చని తెలిపాయి. భారీ అప్పుల్లో ఉన్న ఎంటీఎన్ఎల్‌ను బీఎస్ఎన్ఎల్‌లో విలీనం చేయడం ఎంతమాత్రం సరైన పద్ధతి కాదని కేంద్రం భావిస్తుండడమే దీనికి కారణమని సంబంధిత వర్గాలు తెలిపాయి. దాని బదులు కార్యకలాపాలు అప్పగించడమే మేలని ప్రభుత్వం యోచిస్తోంది. తొలుత సెక్రటరీల కమిటీ ముందు ఈ ప్రతిపాదన ఉంచి తర్వాత కేబినెట్ ఆమోదానికి పంపిస్తారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దేశంలోని ఢిల్లీ, ముంబై నగరాల్లో ఎంటీఎన్ఎల్ కార్యకలాపాలు నిర్వహిస్తుండగా... ఈ రెండు నగరాలు మినహా దేశమంతటా బీఎస్ఎన్ఎల్ సేవలందిస్తోంది. ప్రస్తుతం ఎంటీఎన్ఎల్‌కు భారీగా అప్పులు ఉన్నాయి. ఈ ఏడాది జులై 20కి బాండ్ హోల్డర్లకు చెల్లించాల్సిన వడ్డీ చెల్లింపులకూ తగినంత నిధుల్లేక ఇబ్బందులు పడుతోంది.

2023-24 జనవరి-మార్చిలో 46 లక్షల మంది (వైర్, వైర్‌లెస్) వినియోగదారులు ఉండగా... ఆ సంఖ్య ప్రస్తుత ఏడాది 41 లక్షలకు తగ్గింది. నష్టాలు కూడా రూ.2,915 కోట్ల నుంచి రూ.3,267 కోట్లకు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం సైతం 14.6 శాతం క్షీణించి రూ.798.56 కోట్లకు తగ్గింది. దీంతో ఓ ఒప్పందం ద్వారా కార్యకలాపాల అప్పగింతను కేంద్రం పరిశీలిస్తోంది.

న్యాయపోరులో పీటీఐ గెలుపు

- పార్లమెంటులో అతిపెద్ద పార్టీగా ఆవిర్భావం
- రిజర్వుడ్ స్థానాలపై సుప్రీం తీర్పుతో ఊరట

ఇస్లామాబాద్: పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ (పీటీఐ) న్యాయపోరులో విజయం సాధించింది. రిజర్వుడ్ స్థానాలపై సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో ఇమ్రాన్ ఖాన్ పార్టీకి బలపడింది. పార్లమెంటులో అతిపెద్ద పార్టీగా పీటీఐ నిలిచింది. మహిళలు, మైనారిటీలకు రిజర్వుడ్ స్థానాలు కేటాయించే అర్హత ఉన్నదంటూ పీటీఐకి అనుకూలంగా సుప్రీంకోర్టు 13మంది సభ్యుల విస్తృత ధర్మాసనం తీర్పునిచ్చింది. పార్లమెంటు, ప్రావిన్షియల్ అసెంబ్లీలలో ఈ పార్టీకి రిజర్వుడు సీట్లు కేటాయించరాదన్న పాకిస్థాన్ ఎన్నికల సంఘం (ఈసీపీ) తీసుకున్న నిర్ణయాన్ని తోసిపుచ్చింది. ఇది రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొంది. దీంతో పీటీఐ సంఖ్యా బలం 86 నుంచి 109కు పెరిగింది. 23 రిజర్వుడ్ స్థానాలను తిరిగి పొందింది. అదే విధంగా ప్రతిపక్ష కూటమి బలం 120కు పెరిగింది. ప్రస్తుతానికి పీటీఐతో పాటు ప్రతిపక్ష పార్టీ ఎంపీలు 97 మంది ఉన్నారు. దిగవ సభలో పీటీఐ సభ్యులు 86 మంది ఉన్నారు. వీరిలో 84 మంది సున్నీ ఇత్తెహాద్ కౌన్సిల్ (ఎస్ఐసీ)లో ఉండగా మరో ఇద్దరు స్వతంత్రంగా ఎన్నికయ్యారు. సుప్రీం కోర్టు తాజా తీర్పుతో అధికార సంకీర్ణానికి పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. పార్లమెంటులో పీటీఐ ప్రవేశానికి మార్గం సుగమమైంది. ఎన్నికల గుర్తును రద్దు చేయడమంటే ఎన్నికల్లో ఆ పార్టీ అర్హతను కోల్పోయినట్లు కాదని సర్వోన్నత ధర్మాసనం తేల్చిచెప్పింది. పీటీఐ గతంలోనే కాదు ఇప్పుడు కూడా రాజకీయ పార్టీయేనని స్పష్టంచేసింది.

సిరియా ఎప్పటికీ మోకరిల్లదు!

అబ్దుల్ రెహమాన్ ఖలీల్ విడుదలకు సిరియా కమ్యూనిస్టు పార్టీ డిమాండ్

దమాస్కస్: సిరియా ఎప్పటికీ మోకరిల్లదని సిరియా కమ్యూనిస్టు పార్టీ ఒక ప్రకటనలో ఉద్ఘాటించింది. పౌరుల రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాస్తూ అమెరికా వలసవాదులతో కలిసి కొనసాగిస్తున్న అన్యాయమైన వికృత చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొంది. పార్టీ పొలిట్ బ్యూరో నామినేటెడ్ పదవిలో ఉన్న అబ్దుల్ రెహమాన్ ఖలీల్ నిర్బంధాన్ని ఆక్షేపించింది. పార్లమెంటు సభ్యుడు కూడా అయిన ఖలీల్‌ను వెంటనే విడుదల చేయాలని సిరియా కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది. పీపుల్స్ అసెంబ్లీ కోసం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అబ్దుల్ రెహమాన్ ఖలీల్‌పై దురాగతాన్ని ఖండించింది. ఆయన ఉక్కు సంకల్పానికి సెల్యూట్ చేస్తున్నట్లు తెలిపింది. వలసవాదులు, అణచివేతదారుల దురహంకారాన్ని, అరాచకాలను ఎదురించే ఇలాంటి దేశభక్తులను శ్లాఘిస్తామని పేర్కొంది. 'సిరియా ఎప్పటికీ మోకరిల్లదు...ఎవరికీ తలవంచదు' అని నినాదమిచ్చింది.

జమ్మూకశ్మీర్‌కు మోదీ మోసం: ఖడ్గే



న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019 నిబంధనలను సవరించి హోం శాఖ జారీ చేసిన తాజా ఉత్తర్వులతో జమ్మూకశ్మీర్‌కు మోదీ ప్రభుత్వ నమ్మకద్రోహం నిరాటంకంగా కొనసాగుతోందని స్పష్టమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే వ్యాఖ్యానించారు. మోదీ హయాంలో నిత్య 'సంవిధాన్ హత్యా దివస్'కు మరొక ఉదాహరణ ఇదని 'ఎక్స్'లో విమర్శించారు. 'జమ్మూకశ్మీర్‌ను మోదీ ప్రభుత్వం మోసగిస్తోంది. ఈ విషయంలో ఏ మాత్రం వెనక్కి తగ్గడంలేదు. పునర్వ్యవస్థీకరణ చట్టంలోకి కొత్త సెక్షన్లను చేర్చి లెఫ్టినెంట్ గవర్నర్‌కు మరిన్ని అధికారాలు ఇవ్వడం ఇందుకు నిదర్శనం. సెప్టెంబరు 30లోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదాను పునరుద్ధరించే ఉద్దేశం మోదీ ప్రభుత్వానికి లేదని తాజా పరిణామంతో స్పష్టమైంది. ఒకవేళ రాష్ట్ర హోదాను పునరుద్ధరించినా కొత్త ప్రభుత్వాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ దయదాక్షిణ్యాలకు వదిలేయాలని సర్కార్ భావిస్తోందని అర్థమవుతోంది' అని ఖడ్గే వ్యాఖ్యానించారు.

జమ్మూకశ్మీర్ ఎల్జీకి మరిన్ని అధికారాలు

నిబంధనలు సవరించిన కేంద్రం



న్యూఢిల్లీ: కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం (ఈసీ) కసరత్తు చేస్తున్నది. ఈ నేపథ్యంలో జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2019 నిబంధనలను కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సవరించింది. లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) మనోజ్ సిన్హాకు కేంద్ర ప్రభుత్వం మరిన్ని అధికారాలు కల్పించింది. అంతర్గత భద్రత, బదిలీలు, ప్రాసిక్యూషన్, అటార్నీ జనరల్, ప్రభుత్వ న్యాయవాదుల నియామకం సహా కీలకమైన విషయాల్లో ఎల్జీదే పెత్తనం కానున్నది. 'చట్టం ప్రకారం లెఫ్టినెంట్ గవర్నర్ విచక్షణాధికారాన్ని అమలు చేయడానికి పోలీస్, పబ్లిక్ ఆర్డర్, ఏఐఎస్, ఏసీబీ, ఆర్థిక శాఖకు సంబంధించి అవసరమయ్యే ఏ ప్రతిపాదననూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా లెఫ్టినెంట్ గవర్నర్ ముందు ఉంచితే తప్ప ఆమోదం లేదా తిరస్కారం పొందదు' అని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కాగా, జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వ బిజినెస్ రూల్స్ 2019ను కూడా కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సవరించింది. ఈ సవరణలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో జులై 12న గెజిట్‌లో పేర్కొనడంతో ఈ నిబంధనలు అమలులోకి వచ్చాయి. ఈ నిబంధనల ద్వారా జమ్మూకశ్మీర్‌లో కొత్తగా ఎన్నికయ్యే ప్రభుత్వానికి అధికారాలు పరిమితంగా ఉండనున్నాయి.

ఆ ముగ్గురిని కస్టడీకి తీసుకుని విచారించండి

హోం మంత్రి, డీజీపీలకు ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు వినతి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఒక పార్లమెంటు సభ్యుడిని అపహరించి, చంపాలని చూసిన వారిని కఠినంగా శిక్షించాలని బాధితుడైన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు రాష్ట్ర డీజీపీ, హోం మంత్రిని కోరారు. శనివారం ఆయన తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ నిందితులను వెంటనే అరెస్టు చేసి కస్టడీలో విచారించాలని డిమాండ్ చేశారు. తన వద్ద ఉన్న ఆధారాలన్నీ కేసు విచారణ అధికారికి అందజేస్తానని తెలిపారు. ప్రాథమిక విచారణ పూర్తయ్యే వరకు నిందితులను బయటకు వదలొద్దని, సాక్షులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. అప్పటి వైద్యులపై ఒత్తిడి చేయకుండా పోలీసులు నిఘా పెట్టాలి. హైకోర్టు జడ్జి సమక్షంలోనే మిలటరీ ఆసుపత్రి వైద్యులు నివేదిక సిద్ధం చేశారు. హింసించడం వల్లే వేలు విరిగిందని, రక్తస్రావమైందని నివేదికలో ఉంది. ఆధారాలు ఉంటే ఎప్పుడైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చు. కొట్టిన వారిని గుర్తుపట్టలేదని గతంలో చెప్పిన మాట నిజమే. కొట్టేందుకు కుట్ర పన్నింది జగన్, సీతారామాంజనేయులు, సునీల్. కేసు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఐపీఎస్ సునీల్ ప్రయత్నిస్తున్నారు. అప్పటి ఆసుపత్రి సూపరింటెండెంట్ నివేదికను తారుమారు చేశారు. ఈ వివరాలన్నీ తెలియజేస్తూ గత నెల 10న గుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేశానని రఘురామ వివరించారు. ఈ ఫిర్యాదు మేరకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆయన హయాంలో సీఐడీ విభాగాధిపతిగా పనిచేసిన పీవీ సునీల్‌కుమార్, నిఘా విభాగాధిపతిగా వ్యవహరించిన పీఎస్ఆర్ ఆంజనేయులు సహా మరికొందరిపై గుంటూరు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

'రేషన్'లో పాత పద్ధతి కొనసాగించాలి: వెంకట సుబ్బయ్య

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో రేషన్ షాపులను కుదిస్తూ గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగించాలని పౌర సరఫరాలశాఖ హమాలీ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గొల్లపూడిలో ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ సమస్యపై పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు విన్నవించినట్టు చెప్పారు. జగన్ ప్రభుత్వం తీసుకున్న రేషన్ షాపుల కుదింపు నిర్ణయం వల్ల మండల స్టాక్ పాయింట్లలో పనిచేస్తున్న హమాలీలకు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇదే విషయమై పౌర సరఫరాల శాఖ కమిషనర్‌కు, మేనేజింగ్ డైరెక్టర్‌కు అనేక సార్లు విజ్ఞప్తి చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. షాపుల కుదింపుల వలన అన్ని జిల్లాలలో హమాలీలు ఉపాధి కోల్పోయారని చెప్పారు. కొన్నిచోట్ల కోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకున్నా వాటిని సక్రమంగా అమలు పరచడం లేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికులకు కూలిరేట్లు అగ్రిమెంటు 2024 జనవరి నుంచి ఇవ్వవలసి ఉండగా ఇప్పటికి ఏడు నెలలు కావస్తున్న స్పందించ లేదన్నారు. యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు పాల్గొన్నారు.

60 లక్షల మందితో ప్రకృతి వ్యవసాయం: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-విజయవాడ: రాబోయే రోజుల్లో 60 లక్షల మంది రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానాన్ని చేరువ చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్‌ఎఫ్)కు "గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యుమానిటీ" అవార్డు వరించిన సందర్భంగా ఆయన ఏపీసీఎన్‌ఎఫ్ ప్రతినిధులకు, రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏపీసీఎన్‌ఎఫ్ కార్యక్రమానికి 2024వ సంవత్సరానికి గాను దేశంలోనే ప్రప్రథమంగా ప్రతిష్టాత్మక "గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యుమానిటీ" అవార్డు దక్కడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఏపీ సీఎన్‌ఎఫ్ చేస్తున్న కృషిని, పనితీరును గుర్తించి ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక చేసినందుకు పోర్చుగల్‌కు చెందిన "కలుస్ట్ గుల్బెంకియన్ ఫౌండేషన్" కు, అవార్డు ప్రకటించిన జ్యూరీకి నాయకత్వం వహించిన జర్మనీ మాజీ ఫెడరల్ చాన్సలర్ ఏంజెలా మెర్కెల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రైతుల సంక్షేమంతో పాటు వాతావరణ ఎమర్జెన్సీని దృష్టిలో ఉంచుకొని 2016లో తాము ఏపీసీఎన్‌ఎఫ్ ద్వారా ఆరంభించిన సరికొత్త ప్రకృతి వ్యవసాయ మోడల్‌కు గ్లోబల్ స్థాయి గుర్తింపు రావడం అత్యంత ఆనందంగా ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయ మార్గంలో ప్రయాణిస్తున్న 10 లక్షల మంది రైతుల ప్రతినిధిగా నాగేంద్రమ్మ ఈ అవార్డు అందుకోవడం మహిళా సాధికారతకు నిదర్శనం అన్నారు. ఈ అవార్డు కింద ప్రకటించిన 3,30,000 యూరోలను (రూ.3 కోట్లు) ఏపీసీఎన్‌ఎఫ్ గ్లోబల్ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమ విస్తరణకు వినియోగించడం జరుగుతుందని అన్నారు.

గంజాయి రహిత రాష్ట్రంగా ఏపీ

- యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ టీం ఏర్పాటు చేస్తాం
- పోలీసులకు త్వరలో పదోన్నతులు
- డీజీపీ ద్వారకా తిరుమలరావు

విశాలాంధ్ర-తిరుపతి: ఆంధ్ర ప్రదేశ్‌ను గంజాయి రహిత రాష్ట్రంగా మారుస్తామని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. గంజాయి సమాచారం ఇవ్వడానికి ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబరు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు త్వరలో యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తిరుపతి పోలీసు అతిథి గృహం కాన్ఫరెన్సు హాలులో శనివారం ఆయన అనంతపురం, కర్నూలు రేంజ్ ఎస్పీలతో నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లింగ్‌ను పూర్తి స్థాయిలో అడ్డుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన నగరాల్లో మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసులకు త్వరలో పదోన్నతులు కల్పిస్తామని, సిబ్బంది సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామని ఆయన తెలిపారు. పౌరులకు మెరుగైన సేవలు అందిస్తామని, నేరాలను అదుపు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. ప్రతి జిల్లాలో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటామని చెప్పారు. తమ సిబ్బందికి నేర పరిశోధనపై అవగాహన కల్పిస్తామన్నారు. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ పెడతామన్నారు. క్రింది స్థాయి సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తామని డీజీపీ హామీ ఇచ్చారు. అనంతపురం, కర్నూలు రేంజ్‌లో నేరాల అదుపు, శాంతి భద్రతలను కాపాడే విధానం, స్థానిక సమస్యలపై అన్ని జిల్లాల అధికారులతో కూలంకుషంగా చర్చించారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించడానికి అవసరమైన వనరులు సరిగా లేవని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వాహనాలు పాతబడ్డాయని, త్వరలో వాహనాలు సమకూరుస్తామన్నారు. క్షేత్రస్థాయిలో పోలీసులు బాగా పని చేయాలని కోరారు. పోలీసు సిబ్బందితో పాటు ఎస్సైలు, సీఐలు, డీఎస్పీలు కూడా ప్రాథమిక పోలీసింగ్ చేసుకుంటూ ఉండాలన్నారు. త్వరలో పోలీసుల నియామకం చేస్తామని, ఇందుకు కొంత సమయం పడుతుందన్నారు. పోలీసులు మానవ హక్కులను గౌరవిస్తూ... చట్టాన్ని దుర్వినియోగం చేయకూడదన్నారు. ప్రస్తుతం గంజాయి మీద నూరు రోజులు ప్రణాళిక రూపొందించామన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో గంజాయి పంటను గుర్తించి నిర్మూలిస్తామన్నారు. చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తామన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలపై ప్రజలకు, చిన్నపిల్లలకు కూడా అవగాహన కల్పించాలని డీజీపీ అన్నారు. ఈ సమావేశానికి అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షెముషి బాజ్‌పాయ్, తిరుపతి ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, అన్నమయ్య ఎస్పీ కృష్ణారావు, కర్నూలు ఎస్పీ కృష్ణకాంత్, కడప ఎస్పీ సిద్ధార్థ కౌశల్, సత్యసాయి ఎస్పీ మాధవ రెడ్డి, చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు, అనంతపురం ఎస్పీ గౌతమి శాలి హాజరయ్యారు.

చేనేతల సంక్షేమానికి కృషి

సత్వరమే బకాయిలు చెల్లించేలా చర్యలు: మంత్రి సవిత

విశాలాంధ్ర-గూడూరు: చేనేత సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని, ప్రతి కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటామని రాష్ట్ర బీసీ, ఆర్థిక బలహీన వర్గాల సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత హామీనిచ్చారు. కృష్ణా జిల్లాలోని పెడన నియోజకవర్గంలో ఆమె శనివారం పర్యటించారు. పోలవరంలోని శ్యామ్ ప్రసాద్ చేనేత సహకార సంఘం, కప్పలదొడ్డిలోని దేవల మహర్షి సహకార సంఘం, పెడనలోని శ్రీ సదాశివలింగేశ్వర చేనేత సహకార సంఘాలను సందర్శించారు. వస్త్రాలు, మగ్గాలను పరిశీలించారు. బీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు మంత్రి తెలిపారు. చేనేత వస్త్ర పరిశ్రమపై ఆధారపడే ప్రతి కుటుంబానికీ 365 రోజులు ఉపాధి కల్పిస్తామన్నారు. చేనేత సహకార సంఘాలకు బకాయి చెల్లింపులు సకాలంలో జరిగేలా చూస్తామని, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తామని, ముడిసరుకు మీద సబ్సిడీ ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

కాలానుగుణంగా చేనేత వస్త్రాలను డిజైన్ చేసేందుకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. చేనేతలకు కేంద్ర పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. చేనేత వస్త్రాల ఎగుమతులకు సహకరిస్తామని మంత్రి అన్నారు. పెడన శాసనసభ్యుడు కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 26 చేనేత సహకార సంఘాలులో 18 ఒక్క పెడనలో ఉన్నాయన్నారు. వీటికి దాదాపుగా రూ.104 కోట్ల బకాయి మొత్తం చెల్లించాల్సి ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మంత్రి సవిత పట్టణంలోని ప్రసాద్ కలంకారి వస్త్ర పరిశ్రమను సందర్శించి హస్తముద్రికల పనిని పరిశీలిం చారు. వస్త్ర తయారీలోని ఏడు దశలను మంత్రికి యజమాని బళ్ళ ప్రసాద్ వివరించారు. రంగుల తయారీకి ఉపయోగించే ముడి సరుకుల సరఫరాకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సహకరించాలని, ముడి సరుకు బ్యాంకు ఏర్పాటు చేయాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు, హెల్త్ స్కీము, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆప్కో ఎండీ పవన్‌మూర్తి, చేనేత, జౌళి శాఖ కమిషనర్ శ్రీకాంత్ ప్రభాకర్, బందరు ఆర్డీవో వాణీ, బీసీ సంక్షేమ శాఖ జేడీ తనూజ రాణి, గూడూరు మండల తహసీల్దారు ఎస్ఎస్ శాంతి, బీసీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు బొడ్డు వేణు గోపాల్, వివిధ చేనేత సహకార సంఘాల అధ్యక్షులు పిచ్చుక గురూజీ కుమార్, పిచ్చుక నరేశ్, శరవణ కుమార్, బళ్లా సాయి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆహా... ఏమి రుచి!

- నోరూరిస్తున్న 'పులస'
- గోదావరికి చేరిన సముద్రపు చేపలు
- మత్స్యకార వలలకు చిక్కుతున్న వైనం
- ధరతో సామాన్యుల గుండె గుబేలు

విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి-కోనసీమ: ఆహా... ఏమి రుచి తినరా మైమరచి అన్నాడు ఓ సినీ గేయరచయిత. పుస్తెలమ్మి అయినా పులస తినాల్సిందే అనేది పెద్దల నానుడి. గోదావరి జిల్లా వాసులకే కాదు... పులస చేప తిన్న ఎవరికైనా ఆ చేప పేరింటేనే నోరూరిపోతుంది. జిహ్వ లాగేస్తుంది. దానిపై మక్కువ మరింత పెంచే స్తుంది. ఆ చేప రుచి అలా ఉంటుంది మరి. అందుకనే పుసల చేపలను కొనడానికి జనాలు ఎగబడుతుంటారు. పులస పడిందా... ఆ మత్స్యకారుడి పంట పండినట్లే. ధర ఆకాశానికి చేరుకుంటుంది. ప్రస్తుతం గోదావరి పరీవాహక ప్రాంతంలోని అప్పారాముని లంకలో పులస ఒకటి మత్స్యకారుల వలలోకి చిక్కింది. దీని ధర రూ.24 వేలు పలికింది. అంటే దీనికి ఎంత డిమాండ్ ఉంటుందో దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు.

గోదావరికి వరద నీరు పోటెత్తడంతో వరదనీటి తీపికి సముద్రంలో ఉండే ఉప్పు చేపలైన పులస చేపలు గోదావరిలో ఈదుకుంటూ ధవళేశ్వరం వరకు ప్రయాణం సాగిస్తాయి. ప్రస్తుతం గోదావరిలోకి వారం రోజులుగా వరద నీటి ప్రవాహం పెరగడంతో పులస చేపలు మత్స్యకారుల వలలకు చిక్కుతున్నాయి. అప్పారాముని లంకలో పులస ఒకటి మత్స్యకారుల వలలోకి చిక్కడంతో దీని ధర రూ.24 వేలు పలికిందని చెబుతున్నారు. ఎంతో రుచికరంగా ఉండే ఈ పులస చేపను బెండకాయలు కొత్తిమీరతో కలిపి వండితే రుచి మరింత అమోఘంగా ఉంటుందని కోనసీమ ప్రాంత ప్రజలు చెబుతుంటారు. గోదావరి పరిసర ప్రాంతవాసులు... పులస చేపలను తమ బంధువులకు హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు వండి పంపించటం ఆనవాయితీగా ఉంటుంది. ప్రతి ఏటా పలువురు రాజకీయ నాయకులు తమ తమ అధినాయకులకు పులస చేప వంటల రుచి చూపిస్తుంటారు. అయితే ఈ పేరు వినగానే నోరూరే జిహ్వాచాపల్యులకు దీని ధర వింటే మాత్రం నషాలం అంటుతుంది. పాతికవేల రూపాయలు పెట్టి ఈ చేపను కొనాలంటే సామాన్యులకు కష్టం. ఇక ఉద్యోగులు, బడా వ్యాపారులు, రాజకీయ నాయకులు ఎంత ధర అయినా వెనుకాకుండా పులస చేపలను కొంటారు. ప్రస్తుతం సీజన్ ప్రారంభమైంది. వచ్చే నెల ఆగస్టు నాటికి పులస చేపల లభ్యత మరింత పెరిగితే ధర కాస్త సామాన్యులకు అందుబాటులోకి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. అయితే మత్స్యకారులకు పులస చేపల వల్ల భారీ ఆదాయం సమకూరుతుంది.

ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలి

రాష్ట్ర ప్రభుత్వానికి పీవీ రమేశ్ సూచన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ పతనమైందని, అప్పులు రూ.14 లక్షల కోట్లకు పెరిగాయని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేశ్ ఆరోపించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర కార్యాలయంలో 'ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి-కార్యాచరణ' అంశంపై చర్చా కార్యక్రమం శనివారం జరిగింది. డాక్టర్ పీవీ రమేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతిరోజు రూ.75 కోట్లు వడ్డీ చెల్లిస్తున్నామని, మరో రూ.175 కోట్లు ప్రతిరోజు అప్పులు చేసే దుస్థితికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దిగజారిందని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, వైసీపీ ప్రభుత్వం చట్టబద్ధ దోపిడీ చేస్తూ మోసపూరిత వ్యాపారసంస్థగా మారిందని విమర్శించారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో 80 శాతం ఉద్యోగులకు ఎలాంటి పని ఉండటం లేదని, రాష్ట్రంలో రాజకీయ పార్టీలు ప్రజలను కులాల ప్రాతిపదికగా విభజించి ఓట్లు పొందాలని భావిస్తున్నాయన్నారు. వ్యవసాయం, పారిశ్రామిక రంగాలలో ఉత్పాదకత పెంచి... దళారి వ్యవస్థను రూపుమాపాలన్నారు. ఇంగ్లాండ్‌లో అమలవుతున్న వైద్య విధానాన్ని మన దేశానికి వర్తింప చేస్తే...పేదలకు మంచి వైద్యం లభిస్తుందన్నారు. మట్టి, ఇసుక, మైనింగ్ లాంటి సహజ వనరులను గత పాలకులు దోచుకొని... అవినీతిని తారస్థాయికి తీసుకెళ్లారని ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క శాతం జనాభా చేతిలో 44 శాతం ఆస్తులు, 24 శాతం ఆదాయం ఉందని, అట్టడుగున ఉన్న 50 శాతం ప్రజలు కేవలం 5 శాతం ఆస్తులు కలిగి ఉన్నట్లు చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రెండు వేల జనాభా ఉన్న గ్రామాలలో ఏటా సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు 60 లక్షల రూపాయలు జీతాల రూపంలో చెల్లిస్తున్నారని, కానీ ఆయా గ్రామాలలో 60 లక్షల రూపాయల అభివృద్ధి పనులు జరగడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రేషన్ బియ్యాన్ని 98 శాతం లబ్దిదారులు ఉపయోగించుకోవడం లేదని, కిలో బియ్యం రూ.7 నుంచి రూ.10 వరకు దళారులకు అమ్ముతూ అవినీతి పెరగడానికి దోహదపడుతున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితులలో నాణ్యత గల సన్న బియ్యం అందించాలని కోరారు.

పీవీ రమేశ్ సేవలు వినియోగించుకోవాలి: మాజీమంత్రి డొక్కా

మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ దేశ, విదేశాలలో అపారమైన అనుభవం గడించి...నీతి, నిజాయతీకి, నిబద్ధతకు మారుపేరుగా నిలిచిన డాక్టర్ పీవీ రమేశ్ సేవలను ప్రభుత్వం వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు పి.రామచంద్ర రాజు, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్‌కుమార్, మానవత సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, మానవత చైర్మన్ పావులూరి రమేశ్, ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ అబ్బరాజు రాజశేఖర్, ఎం.కోటేశ్వర రావు, ప్రైవేట్ విద్యాసంస్థల ఉపాధ్యక్షుడు మేకల రవీంద్రబాబు, మానవత పూర్వ కార్యదర్శి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీకారానికేనా?

- వైసీపీ పాలనలో అక్రమాలపై టీడీపీ ఫోకస్
- భయాందోళనలో కొందరు నేతలు, అధికారులు
- కీలక విభాగాల్లో శ్వేతపత్రం

విశాలాంధ్ర-ప్రత్యేక ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లోని వైసీపీ పాలనలో ప్రతి ప్రభుత్వ విభాగంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం దృష్టి పెట్టడంతో కొందరు అవినీతి నేతలు, అధికారులు ఆందోళన చెందుతున్నట్టు తెలుస్తోంది. పైకి తమకు సంబంధం లేదని చెబుతున్నా... లోలోపల మాత్రం ఎప్పుడు ఎలాంటి ఉపద్రవం ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న భయంతో వణికిపోతున్నట్టు విశ్వసనీయ సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాంలో (2019 నుంచి 2024) తాము ఎలాంటి అక్రమాలు చేసినా అవి సక్రమాలే అవుతాయనే ఆలోచనతో... విపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా, తప్పులపై ప్రశ్నించినా వైసీపీ నేతలు ఎదురుదాడికి దిగేవాళ్లు. ప్రభుత్వ పెద్దల అండదండలతో కొందరు అధికారులు సైతం నిబంధనలు పక్కనపెట్టి... అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికారులు తమ తప్పులకు తగిన శిక్ష అనుభవించాల్సి వస్తుందని అప్పట్లో టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో పాటు పార్టీ నేతలు హెచ్చరించినా పెద్దగా పట్టించుకోలేదు. 2024లో జరిగిన ఎన్నికలో ఘోర పరాభవాన్ని మూటగట్టుకుని ప్రజల విశ్వాసం కోల్పోవడంతో మెజార్టీ సీట్లు దక్కించుకున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఏ ప్రభుత్వ శాఖను కదిలించినా గత ప్రభుత్వంలో అవినీతి, అక్రమాల చిట్టా బయటకు వస్తున్నాయని భోగట్టా.

కూటమి ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన జనసేన ఎమ్మెల్యే నాదేండ్ల మనోహర్... అధికంగా రేషన్ దుకాణాలు, స్టాక్ పాయింట్లు తనిఖీ చేస్తున్నారు. ఆయన సోదాల్లో రేషన్ పంపిణీలో జరిగిన అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. ప్రత్యేకించి బియ్యం రీసైక్లింగ్ భారీ కుంభకోణం జరిగిందనే ఆరోపణలు హల్‌చల్ చేస్తున్నాయి. కేవలం అక్రమాలు, అవినీతి ఆ శాఖకే పరిమితం కాలేదు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖలో నిధుల మళ్లింపు, కాంట్రాక్టర్లకు చెల్లింపుల విషయంలోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వివిధ కీలక విభాగాల్లో జరిగిన అవకతవకలను ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో శ్వేతపత్రాలను విడుదల చేస్తోంది. దీని ద్వారా ప్రస్తుత పరిస్థితిని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తోంది. అదే సమయంలో గత ప్రభుత్వ పాలనలో చోటుచేసుకున్న తప్పులపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మరో నాలుగైదు నెలల్లో ప్రభుత్వ విధానాలు, గత ప్రభుత్వ అక్రమాలపై ఎలాంటి చర్యలు ఉండబోతున్నాయనే దానిపై స్పష్టత రానుంది. చేసిన తప్పులకు చిన్నపాటి దండనతో సరిపెడతారా లేదా ప్రతీకారం తీర్చుకుంటారా అనేది వేచి చూడాలి.

వైద్యానికి 10 శాతం నిధులు

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జేసీ నాయుడు డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో వైద్య రంగానికి కనీసం పది శాతం నిధులు కేటాయించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జేసీ నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక ఐఎంఏ రీజనల్ అకాడమిక్ కాన్ఫరెన్స్ జోన్-2 సదస్సు శనివారం సాయి ఐటీఏ కన్వెన్షన్ హాలులో ప్రారంభమైంది. జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ ఝాన్సీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేసీ నాయుడు మాట్లాడుతూ బడ్జెట్లో ప్రభుత్వాలు కేటాయిస్తున్న నిధులు జీతాలకు కూడా సరిపోవడం లేదన్నారు. వైద్యరంగాన్ని ప్రోత్సహించేందుకు మరిన్ని నిధులు కేటాయించాలన్నారు. కేరళలో 13 శాతం బడ్జెట్ నిధులు కేటాయిస్తున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితులలో వైద్య వృత్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత డాక్టర్లు, ప్రజలు, ప్రభుత్వంపై ఉందన్నారు. కొత్తగా ఆసుపత్రి నిర్మించుకోవాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త చట్టాలలో వైద్యవృత్తికి సంబంధించిన చట్టాలను సవరించాలని డిమాండ్ చేశారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుల ఫోరం చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద వైద్యుల ఎన్జీవో సంఘం ఐఎంఏ అన్నారు. దేశవ్యాప్తంగా నాలుగు లక్షల మంది వైద్యులు అసోసియేషన్ లో ఉన్నారన్నారు. రాష్ట్రంలో 21 వేల మంది సభ్యులు ఉన్నారన్నారు. డాక్టర్లకు నిరంతరం తమ స్కిల్‌ను డెవలప్ చేసుకోవడానికి ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. ఐఎంఏ రాష్ట్ర పూర్వాధ్యక్షుడు డాక్టర్ నల్లూరి రాఘవ మాట్లాడుతూ ఐఏఎస్, ఐపీఎస్‌వలే ఐఎంఎస్‌లను కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. డాక్టర్లకు ఒక ఎమ్మెల్సీ ఇవ్వాలన్నారు. జాతీయ పూర్వాధ్యక్షుడు డాక్టర్ సమరం మాట్లాడుతూ ఐఎంఏ కేవలం డాక్టర్ల సమస్యలపై కాకుండా ప్రజారోగ్యంపై నిరంతరం కృషి చేస్తుందన్నారు.

ఆరోగ్యశ్రీ మధ్యతరగతి ప్రజలకు కూడా వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సాధించాలని కోరారు. వ్యాధి నిరోధక శక్తి పెంచేలా ప్రజలకు ఆహారం అందించాలన్నారు. ఐఎంఏ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ జే శేఖర్ మాట్లాడుతూ వైద్య రంగానికి సంబంధించి ప్రతి వస్తువుపై భారీగా జీఎస్టీ పెంచడం వల్ల వైద్యం మరింత భారంగా మారిందన్నారు. జీఎస్టీ తగ్గించాలన్నారు. ఐఎంఏ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రావణి, జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ మణి బాబు, రీజియన్ పరిధిలో 700 మంది డాక్టర్లు హాజరయ్యారు.

మా భూములు తిరిగి ఇప్పించండి

ఎమ్మెల్సీ రఘురాజుకు జిందాల్ నిర్వాసితుల వినతి

విశాలాంధ్ర-శృంగవరపుకోట(విజయనగరం): తాము ఇచ్చిన భూములను వెనక్కి ఇచ్చేస్తే మీరు చెల్లించిన నగదు నయాపైసాతో సహా చెల్లిస్తామని జిందాల్ నిర్వాసితులు స్పష్టం చేశారు. బొడ్డవరలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజును శనివారం కలిసి తమ గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం నిర్వాసితులు మాట్లాడుతూ... గత 15 ఏళ్లుగా తామిచ్చిన భూముల్లో జిందాల్ పరిశ్రమ వస్తుందని, తమ పిల్లల జీవితాలు బాగుపడతాయని ఎదురుచూసి నిరాశ చెందామని, కొన్ని విషయాల్లో తమను కంపెనీ యాజమాన్యం మోసం చేసిందని ఆరోపించారు. 2008లో నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి మాటలు నమ్మి ఘోరంగా నష్టపోయామన్నారు. పరిశ్రమ వచ్చేస్తుందంటే చాలామంది వ్యతిరేకించినప్పటికీ తమ బతుకులు బాగుంటాయని డీపట్టా భూములు కేవలం రూ.రెండు లక్షలు నగదు, రెండు లక్షల షేర్ ధనం, జిరాయితీ భూములకు రూ.తొమ్మిది లక్షల నగదు, ఆరు లక్షల షేర్ ధనం ఇవ్వడంతో పాటు పరిశ్రమలో తమ పిల్లలకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పారన్నారు. గత ప్రభుత్వంలో ఈ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేస్తామని ప్రకటనలు చేశారని గుర్తు చేశారు. స్పందించిన ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కలిసి జిందాల్ నిర్వాసితుల బాధలను వివరించామని, రాష్ట్ర ప్రభుత్వం కంపెనీ ప్రతినిధులు, నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేయాలని కూడా కోరామన్నారు.

సంపాదకీయం

బీజేపీకి శృంగభంగం

ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికలలో ఆశించిన సంఖ్యలో సీట్లురాక డీలాపడిన బీజేపీకి ఈ నెల పదవ తేదీన జరిగిన ఉప ఎన్నికల్లో మరింత శృంగభంగం కలిగింది. లోక్‌సభ ఎన్నికలతో ప్రారంభమైన ఈ ట్రెండ్ మరింత ముందుకు సాగుతోంది. దేశంలో మారుతున్న రాజకీయ వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఉప ఎన్నికల ఫలితాలు వచ్చాయి. శనివారం వెలువడిన ఉప ఎన్నికల ఫలితాల్లో ఇండియా ఐక్య సంఘటన జోరు ప్రదర్శించింది. సార్వత్రిక ఎన్నికల తర్వాత అధికార ఎన్డీయే, ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటనకు తొలి పరీక్షగా భావించిన అసెంబ్లీల ఉప ఎన్నికల్లో 'ఇండియా కూటమి' జయకేతనం ఎగురవేసింది. దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లో ఇండియా ఐక్య సంఘటన 10 చోట్ల విజయం సాధించింది. బీజేపీ రెండు స్థానాలకు మాత్రమే పరిమితమైంది. మరో చోట స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం నుంచే ఇండియా ఐక్య సంఘటన అభ్యర్థులు ఆధిక్యంలో కొనసాగారు. ఫిబ్రవరి 27న జరిగిన రాజ్యసభ ఎన్నికలలో హిమాచల్‌ప్రదేశ్‌లో ఫిరాయింపులను ప్రోత్సహిం చడం ద్వారా అనైతిక విజయం సాధించిన బీజేపీకి ప్రస్తుతం జరిగిన ఉప ఎన్నికలలో ప్రజలు తగిన పాఠం చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని నాలుగు, హిమాచల్ ప్రదేశ్‌లోని మూడు, ఉత్తరాఖండ్‌లోని రెండు, పంజాబ్, బీహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్‌లోని ఒక్కొక్క స్థానానికి జులై 10న ఉప ఎన్నిక పోలింగ్ జరిగింది. ఇందులో నాలుగు రాష్ట్రాల్లో ఇండియా ఐక్య సంఘటన అధికారంలో ఉండగా, మూడుచోట్ల ఎన్డీయే ప్రభుత్వం ఉంది. ఓట్ల లెక్కింపు శనివారం చేపట్టి ఫలితాలు ప్రకటించారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో అత్యధిక స్థానాలు గెలుపొంది జోరుమీదున్న తృణమూల్ కాంగ్రెస్ తాజా ఉప ఎన్నికల్లోనూ తన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. రాష్ట్రంలో ఉప ఎన్నికలు జరిగిన రాయ్‌గంజ్, రాణాఘాట్, బాగ్దా, మాణిక్‌తలా నాలుగు స్థానాల్లోనూ తృణమూల్ అభ్యర్థులు విజయం సాధించారు. రాయ్‌గంజ్, బాగ్దా, రణఘాట్ దక్షిణ్ స్థానాలను బీజేపీ నుంచి కైవసం చేసుకోగా మానిక్తలాలో రికార్డు విజయాన్ని సాధించింది. ఉత్తరాఖండ్‌లో కాషాయ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలోని ఐదు స్థానాలను గెలుచుకున్న బీజేపీ రెండు నెలలు తిరగకుండానే జరిగిన రెండు అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికలలో ఓటమిని మూటగట్టుకుంది. ఉప ఎన్నిక జరిగిన మంగలౌర్, బద్రీనాథ్ స్థానాలలో కాంగ్రెస్ విజయం సాధించింది. మంగలౌర్‌ను బీఎస్పీ నుంచి కాంగ్రెస్ కైవసం చేసుకున్నది. ఇక్కడ విజయం సాధించేందుకు బీజేపీ అనేక దుష్టఎత్తుగడలు వేసింది. కాషాయ పార్టీ దుష్టపన్నాగాలకు ప్రజలు ఓటు ఆయుధంతో తిప్పికొట్టారు. బద్రీనాథ్‌లో కాంగ్రెస్‌కు చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీలోకి మారారు. ఈ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్‌ని గెలిపించడం ద్వారా ఆయనకి తగిన సమాధానం చెప్పారు. హిమాచల్ ప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల సందర్భంగా బీజేపీకి మద్దతు ప్రకటించి ఆ తరువాత ఎమ్మెల్యే పదవికి రాజీనామాచేసి బీజేపీ తీర్థం పుచ్చుకున్న ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలకు ఈ ఎన్నికల్లో ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారు. ఆ ఇద్దరూ కాంగ్రెస్ అభ్యర్థుల చేతిలో పరాజయాన్ని చవిచూశారు. దేహ్రాలో రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు సతీమణి, కాంగ్రెస్ అభ్యర్థి కమలేశ్ ఠాకుర్ విజయం సాధించారు. ఆమె సమీప బీజేపీ అభ్యర్థిపై 9వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. నాలాగఢ్ స్థానంలో కాంగ్రెస్ నాయకుడు హర్‌దీప్ సింగ్ బవా 8,990 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థిపై విజయం సాధించారు. హమీర్‌పుర్ స్థానంలో మాత్రమే బీజేపీ గెలుపొందింది. పంజాబ్‌లోని జలంధర్ స్థానంలో ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి మోహిందర్ భగత్ బీజేపీ అభ్యర్థి షీతల్‌పై 37వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. జలంధర్ వెస్ట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) భారీ విజయం సాధించడం రాష్ట్ర ప్రభుత్వ పని పట్ల ప్రజలు "చాలా సంతోషంగా ఉన్నారని" తెలియజేస్తోందని ముఖ్యమంత్రి భగవంత్ మాన్ అన్నారు. తమిళనాడులోని విక్రావండి స్థానంలో డీఎంకే అభ్యర్థి అన్నియుర్ శివ విజయం సాధించారు. మధ్యప్రదేశ్‌లోని అమర్‌వాడాలో బీజేపీ అభ్యర్థి కమలేశ్ షా గెలుపొందారు. బీహార్‌లోని రూపౌలి స్థానంలో స్వతంత్ర అభ్యర్థి శంక్ సింగ్ జయకేతనం ఎగురవేశారు. ఉప ఎన్నికలలో ఇండియా ఐక్య సంఘటన ఘన విజయంపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు పవన్ ఖేడా స్పందిస్తూ "2014లో మేము ఎదుర్కొన్నాం ...ఇప్పుడు బీజేపీ వంతు. లోక్‌సభ ఎన్నికలతో ప్రారంభమైన ఈ ధోరణి మరింత ముందుకు సాగుతోంది. రాబోయే అన్ని ఎన్నికల్లో బీజేపీ ఓటమిని చవిచూస్తుంది. 2014 ఎన్నికల్లో మాకు ఇదే విధమైన అనుభవం ఎదురైంది. చాలా ఎన్నికల్లో ఓడిపోయాం...ఇప్పుడు బీజేపీ అదే దశలో ఉంది" అని అన్న వ్యాఖ్యలు అక్షరసత్యాల్లా కనిపిస్తున్నాయి.

కాంగ్రెస్ పార్టీ అనాలోచిత విధానాల కారణంగా సార్వత్రిక ఎన్నికలలో ఇండియా ఐక్య సంఘటన తగిన ఫలితాలు రాబట్టలేకపోయింది. ఈ ఉప ఎన్నికలలో వచ్చిన ఫలితాలతోనైనా కాంగ్రెస్ పార్టీ మేల్కొని ప్రతిపక్షాల మధ్య మరింత ఐక్యతకు కృషి చేయాలి. అవసరమైతే ఆ పార్టీ కొన్ని త్యాగాలకు కూడా సిద్ధపడాలి. కేంద్రంలో ప్రస్తుతం ఉన్నది సంకీర్ణ ప్రభుత్వం అన్న మాట మరిచి తన సొంత పార్టీ ప్రభుత్వంగా వ్యవహరిస్తూ మోదీ చేసే ప్రయత్నాలను తిప్పికొట్టే విధంగా బాధ్యతాయుతంగా వ్యవహరించవలసి ఉంది. మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించాలి. దళితులు, రైతులు, సమాజంలోని అణగారిన వర్గాలలో చైతన్యానికి కృషి చేయాలి. ప్రతిపక్షం ఐక్యంగా చర్చించి సమష్టి వ్యూహంతో వ్యవహరించకపోతే మోదీ మరింత దుష్పరిపాలన సాగించే అవకాశముందన్న విషయాన్ని ప్రతిపక్షం గమనంలో ఉంచుకోవాలి. రానున్న ఐదు రాష్ట్రాల- హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ, బీహార్- అసెంబ్లీ ఎన్నికలలో కాషాయ దళాన్ని మట్టి కరిపించి ఇండియా ఐక్య సంఘటన మరిన్ని ఘన విజయాలు సాధించే దిశగా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కమలం పార్టీకి మరోసారి అవకాశం దక్కకుండా ప్రతిపక్ష పార్టీలు ప్రత్యేకించి వ్యూహరచనతో ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగాలి. ఇందుకు కాంగ్రెస్ పార్టీ బాధ్యత తీసుకోవాలి. ఆయా రాష్ట్రాలలో కేవలం ప్రధాన పార్టీలకే కాకుండా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులన్నింటికి సమాన ప్రాధాన్యత ఇవ్వాలి. సీట్ల సర్దుబాటులో తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకే అధినేత స్టాలిన్‌ను ఆదర్శంగా తీసుకుని కొంత మేర త్యాగం చేస్తూ ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న సీట్ల సంఖ్యతో నిమిత్తంలేకుండా అన్ని పార్టీలకు సీట్లను కేటాయించాలి. అప్పుడే ఇండియా ఐక్య సంఘటన ఓట్లు చీలకుండా ఉంటాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఈ విధానం పాటించని కారణంగా కొన్ని సీట్లను కోల్పోయిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ గమనంలో ఉంచుకుని వ్యవహరించాలి.

ఆదర్శ జర్నలిస్టు ఎంపీ సారథి

నిఖార్సయిన కమ్యూనిస్టు, నమ్మిన సిద్ధాంతాల కోసం కడవరకు కట్టుబడివున్న మహోన్నత వ్యక్తి తెలుగు పత్రికా రంగానికి సుదీర్ఘ కాలంపాటు సేవలందించిన ప్రముఖ జర్నలిస్టు కామ్రేడ్ మాదాసు పార్థ సారథి (ఎంపీ సారథి). విశాలాంధ్ర, సీపీఐ పట్ల ఆయన నిబద్ధత, నిరాడంబర జీవితం మాలాంటి పాత్రికేయులెందరికో ఆదర్శం. విశాలాంధ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. స్నేహశీలి, అజాత శత్రువు అయిన సారథి జీవితం నేటి తరం జర్నలిస్టులకు ఆదర్శనీయం. ఆయనొక నిశ్శబ్ద స్వరూపం, మృదుభాషి, కలం కదలికలతో పాఠకుల మెదళ్లలో చైతన్య కెరటాలు సృష్టించారు. ఆర్థికంగా పేదవాడు అయినప్పటికీ విజ్ఞానపరంగా సుసంపన్నుడు. తనకు తెలిసిన విద్యను దాచుకోకుండా అందరికీ పంచి ఎందరినో ఉత్తమ జర్నలిస్టులుగా తీర్చిదిద్దిన మహనీయుడు. విశాలాంధ్రను ఒక గురుకులంగా రూపుదిద్దిన వారిలో సారథి అగ్రగణ్యులు. విశాలదృక్పథంతో మానవీయ కోణంలో ఆయన ఆలోచనలు వుండేవి. ప్రతి ఒక్కరినీ నిష్ణాతులైన జర్నలిస్టులుగా తయారుచేయాలన్న తపన ఆయనలో ఎంతగానో ఉండేది. పలకరింపులో నిర్మలత్వం, ఆలోచనల్లో ఔన్నత్యం, ఆశయాల ఆచరణలో కచ్చితత్వం ఎంతో నిరాడంబర జీవనం సారథికే సాధ్యమైంది. విశాలాంధ్రలో వివిధ హోదాల్లో ఎనలేని సేవలు అందించారు. విధి నిర్వహణలో ఎటువంటి ఒత్తిడికి గురయ్యేవారు కాదు. విధినిర్వహణలో సమయపాలన, క్రమశిక్షణకు ఆయన మారుపేరు. విశాలాంధ్ర పత్రిక అభివృద్ధికి విశేషంగా కృషిచేశారు. ఇతర పత్రికలలో అనేక అవకాశాలు వచ్చినా తృణప్రాయంగా త్యజించి జీవితకాలం మొత్తం విశాలాంధ్రకే సేవలు అందించారు. అటువంటి మహనీయుడు నేడు మన మధ్యలేకపోయినా ఆయన స్మృతులు పాతతరం జర్నలిస్టులను వెన్నంటే వుంటాయి. కామ్రేడ్ సారథి మన నుంచి భౌతికంగా దూరమై ఈ నెల 15వ తేదీకి 25 సంవత్సరాలు గడుస్తుంది. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయ, కమ్యూనిస్టు జీవితాన్ని ఒకసారి గుర్తుచేసుకుంటే... ప్రకాశం జిల్లా విద్యార్థి ఉద్యమ నిర్మాతలలో, ప్రజానాట్యమండలి ప్రకాశం జిల్లా సంస్థాపకులలో సారథి ఒకరు. ప్రసిద్ధ వామపక్ష పత్రికా రంగ ప్రముఖులు, విశాలాంధ్ర దినపత్రికలో దాదాపు 34 సంవత్సరాలు వివిధ హోదాలలో పనిచేశారు. అభ్యుదయ సాహిత్య రంగంలోనూ, ప్రజానాట్యమండలి నిర్మాణంలోనూ ఆయన కృషి మరువరానిది. వామపక్ష పాత్రికేయునిగా కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. పార్థసారథి స్వగ్రామం ప్రకాశం జిల్లా పేర్నమిట్ట, చిన్ననాటి నుంచి సనాతన భావాలను వ్యతిరేకిస్తూ అభ్యుదయ భావాలను అలవర్చుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు విశాలాంధ్రలోనే పనిచేస్తున్నాడు. ఒంగోలులోని శర్మ కాలేజీలో బీఏ ఉత్తీర్ణత అనంతరం జిల్లా కమ్యూనిస్టుపార్టీ నిర్ణయం ప్రకారం 1965 జూన్‌లో విశాలాంధ్రలో సబ్ ఎడిటర్‌గా చేరారు. న్యూస్ ఎడిటర్, అసిస్టెంట్ ఎడిటర్, అసోసియేట్ ఎడిటర్‌గా పదోన్నతి పొందారు. విశాలాంధ్ర ఎడిటోరియల్ బోర్డు సభ్యునిగా, విశాలాంధ్ర గవర్నింగ్‌బాడి సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. 1972 నుంచి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యునిగా వున్నారు. విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా పనిచేశారు. విశాలాంధ్రలో కమ్యూనిస్టు పార్టీ శాఖ కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేశారు. కామ్రేడ్ సారథి విద్యార్థి దశ నుంచి సాహిత్య సాంస్కృతిక రంగాలలో ఎంతో ఆసక్తి కనబరుస్తూ వచ్చారు. వివిధ జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపైన, తాజా రాజకీయ పరిస్థితులపైన విశాలాంధ్రలో అనేక సంపాదకీయాలు రాశారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఆ సంపాదకీయాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. వ్యాఖ్యలు- విమర్శలు శీర్షికను దీర్ఘకాలంపాటు నిర్వహించి, వ్యంగ్య రాజకీయ రచనలుచేస్తూ వామపక్ష భావజాల ప్రచారాన్ని ఇనుమడింప చేసేందుకు కృషిచేశారు. అనేక గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ పదకోశ రూపకల్పనలో పద సంగ్రహణను అందించారు.

ఏపీయూడబ్ల్యూజే, ప్రెస్ అకాడమీ సంయుక్తంగా అనేక జిల్లాలలో నిర్వహించిన జర్నలిస్టుల శిక్షణాతరగతులలో ఉపాధ్యాయునిగా అనేక అంశాలపై బోధించి ఎందరినో నిష్ణాతులైన జర్నలిస్టులుగా తీర్చిదిద్దారు. యువజర్నలిస్టులకు ఓపికతో శిక్షణనిచ్చేవారు. ముఖ్యంగా ఆంగ్ల భాష నుంచి తెలుగులోకి అనువదించడంలో ఆయన ఇచ్చిన శిక్షణ మరవలేనిది. విసుగు, కోపం అనేది ఆయన ముఖంలో ఎన్నడూ కనిపించేదికాదు. ఎదుటి వ్యక్తిని ఏమాత్రం చిన్నబుచ్చుకోనిచ్చే వారు కాదు. అనువాదంలో వారు చేసిన తప్పులను అర్థమయ్యే రీతిలో సహనంతో సరిదిద్దేవారు. విశాలాంధ్రలో ఆయన వద్ద శిక్షణ పొందిన అనేక మంది నేటితరం జర్నలిస్టులు వివిధ దినపత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. తనతో పనిచేసే వారందరితో కలివిడిగా వుండేవారు. వారి కుటుంబాలతో కూడా సన్నిహిత సంబంధాలుండేవి. తాను ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నప్పటికీ తోటి జర్నలిస్టులు ఇబ్బందుల్లో ఉన్నారని తెలిస్తే తల్లడిల్లిపోయేవారు. వారికి ఏదో రూపేణ సాయం చేసే వరకు మనసు కుదుటపడేదికాదు. అవసరమైతే వారి ఇళ్లకు వెళ్లి ధైర్యం చెప్పేవారు. ట్రెనీ సబ్‌ఎడిటర్లకు మార్గదర్శిగా ఉండేవారు. తోటివారికి సాయం చేయడం ఎలాగో ఆయన నుంచి నేర్చుకోవాల్సిందే. ఆయన కుటుంబానికే కాక విశాలాంధ్రకు, జర్నలిస్టు సమాజానికి, అభ్యుదయ ఉద్యమానికి సారథి లేనిలోటు తీరనిది. ఆయన ఆశయ సాధనకు అంకిత భావంతో కృషిచేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి.

– మోదుమూడి మురళీకృష్ణ

(15-07-2024 కామ్రేడ్ ఎంపీ సారథి 25వ వర్ధంతి సందర్భంగా)

ఇది సామాన్యుల బడ్జెట్ అవుతుందా?

అనిల్ రాజింవాలె

నరేంద్ర మోదీ ప్రభుత్వం జులై 23న 2024-25కు పూర్తిస్థాయి బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. బడ్జెట్ సమావేశాలు జులై 22నుండి ఆగస్టు 12వరకు జరుగుతాయి. సంస్కరణల పేరుతో పదేళ్లుగా అమలుచేస్తున్న విధానాన్ని కొనసాగిస్తారన్న సూచనలున్నాయి. ప్రభుత్వం పదేళ్లుగా ప్రవేశపెడుతున్న బడ్జెట్ విధానాలు ఇప్పటికే కుబేరులైన కార్పొరేట్లను మరింతగా మరింత సంపన్నులను చేసేందుకు ఉపయోగ పడ్డాయి. మన ప్రభుత్వరంగాన్ని అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు మోదీ పాలనసాగింది. మంచిస్థాయిలో ఉన్న ఆర్థికవ్యవస్థను కుదేలు పరిచారు. ఉభయసభల సభ్యులనుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ముర్ము రానున్న బడ్జెట్‌లో అనేక చారిత్రక చర్యలు ఉంటాయని అన్నారు. బీజేపీ పాలన ఉన్న కేంద్రం, రాష్ట్రాల్లో కచ్చితంగా ప్రజలను, దేశాన్ని దిగజార్చి కార్పొరేట్ల ఆర్థిక పెట్టుబడులను పెంచేందుకు అనేక చారిత్రక చర్యలు రానున్న బడ్జెట్‌లో ఉంటాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు జూన్4న ప్రకటించినప్పటినుంచీ ఈక్విటీ షేర్‌మార్కెట్‌లో షేర్ల రేట్లు పెరుగుతాయని సంకేతాలు వచ్చాయి. బడా వాణిజ్యవేత్తలు భారీగా లాభాలు వస్తాయన్న అంచనాలు వేసుకుని ఉన్నారు. నిఫ్టీ, బిఎస్‌ఇలుపైపైకి పెరగనున్నాయని అంచనాలున్నాయి. అయితే ఉత్పత్తి, తయారీ రంగాలను పూర్తిగా విస్మరించ నున్నారు. సామాన్య ప్రజలకు ఉత్పాదకత, ఆర్థిక రంగానికి ఎలాంటి ప్రయోజనం ఉండదన్న అంచనాలు వచ్చాయి. మౌలిక సదు పాయాలు, వాణిజ్య అడ్డంకులు తొలగింపు, జీఎస్‌టీ దుర్వినియోగం లాంటివి ప్రభుత్వానికి తలనొప్పిగా ఉండవచ్చు. మౌలిక సదుపాయాల ఏర్పాటు, ఇంధనరంగం ప్రతినిధులతో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌పై చర్చలు జరిపారు. నగరీకరణను వేగిరం చేసేందుకు చర్యలు తీసుకోవాలని బడా వ్యాపారులు కోరారు.

రానున్న రెండేళ్లలో 15 నగరాల్లో రెండు బిలియన్ డాలర్లు పెట్టుబడులుపెట్టే అవకాశం ఉందని హెచ్‌ఎఫ్‌సి పెట్టుబడిదారీ సలహాదారులు బెట్ కడుతున్నారు. అయితే సహజంగానే ఆర్థికరంగం, పెట్టుబడులు తగ్గనున్నాయి.

సీఎంఇఐ సమాచారాన్ని బరోడా బ్యాంకు విశ్లేషించింది. ఉత్పత్తిరంగంలో పెట్టుబడులు 2025 జూన్‌తో ముగిసే త్రైమాసికంలో రూ.44200 కోట్లు తగ్గిపోతుందని తేల్చింది. ప్రభుత్వం మాత్రం ఆర్థికవృద్ధి సాధించామని చెప్పుకుంటోంది. ఈ సంవత్సరం మొదటి అర్థభాగంలో ఇండియాలో బడా కంపెనీలు ఈక్విటీ మార్కెట్ నుంచి రు.2.5లక్షల కోట్లు సమీకరించింది. భారత ఆర్థిక రంగం ఊహాజనితమైనది. అత్యంత సంపన్నుడైన అదానీ ముంద్రా ఓడరేవులో ఓడలను నిర్మించడానికి సిద్ధమయ్యారు. అదానీకి సేవలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. నౌకల నిర్మాణంలో అతి పెద్ద సంస్థలలో అదానీ నిర్మించే సంస్థలలో ఒకటిగా నిలవాలని ప్రభుత్వం కోరుకుంటోంది. ప్రస్తుతం మన దేశం 20వ స్థానంలోఉంది. ముంద్రా ఓడరేవును రూ.45,000 కోట్లతో విస్తరించాలని నిర్ణయించిందన్న విషయం గుప్తంగా ఉంచారు. దీనివల్ల వాతావరణం దారుణంగా దెబ్బతింటుంది. అయినప్పటికీ వాతావరణానికి, తీరప్రాంత క్రమబద్ధీకరణ జోన్‌లకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతినిచ్చింది. అలాగే మహారాష్ట్ర తీరప్రాంతంలో అతి పెద్ద ఓడరేవును నిర్మించడానికి తలపెట్టింది. చైనా, దక్షిణకొరియా, జపాన్‌లలో యార్డులు నిర్మించడానికి 2028 వరకు అనుమతి పొందింది. ప్రభుత్వరంగ ఓడరేవులు, యార్డుల నిర్మాణాన్ని పక్కదారి పట్టిస్తోంది. అదానీ రోజు ఆదాయం రు.1600 కోట్లు ఉంటుందని అంచనా. స్టాక్‌మార్కెట్‌లో మోసాలకు పాల్పడినట్టు ఇప్పటికే బలమైన ఆరోపణలు వచ్చాయి. ఓడరేవులను ప్రభుత్వ, ప్రైవేటురంగాల పెట్టబడులతో నిర్మించనున్నారు.

ప్రభుత్వం 2025 ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల విక్రయాల ద్వారా లక్ష కోట్లు రూపాయాలు సమీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధంగా ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా విధ్వంసం చేయడానికి మోదీ ప్రభుత్వం పూనుకుంది. ఎన్నికల్లో పూర్తి మెజారిటీ రాకపోవడంతో ప్రభుత్వరంగ సంస్థలను అమ్మడం జాప్యం కావచ్చు. ప్రభుత్వరంగ బ్యాంకుల ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్నందున ప్రభుత్వం జోక్యం చేసుకోవద్దని ఎస్‌బీఐ ఇటీవల ఆకస్మికంగా నివేదిక వెలువరించింది. అలాగే ఐడీబీఐ బ్యాంకు అమ్మకంపై ప్రభుత్వ అభిప్రాయాన్ని తెలియజేయాలని కూడా ఎస్‌బీఐ కోరింది. అయితే ఐడీబీఐలోని 61శాతం వాటాలను ప్రభుత్వం, ఎల్‌ఐసి విక్రయిస్తున్నది. సరైన బిడ్డర్ కనిపించడంలేదని ఆర్‌బీఐ ఐడీబీఐని విక్రయించడం నిలిచిపోయింది. 2019 మార్చిలో ఐడీబీఐని ప్రైవేటుబ్యాంకుగా గుర్తించడంతో ప్రభుత్వం దాన్ని విక్రయించలేకపోతోంది. జూన్‌తో ప్రారంభమయ్యే త్రైమాసికంలో వేగంగా కొనుగోలుచేసే వినిమయ వస్తువుల కొనుగోలు నిలిచిపోయింది. పట్టణప్రాంతంలో విక్రయాల మాంద్యం మరింత ఎక్కువగా ఉంది. ప్రస్తుత రోజువారీ కొనుగోలుచేసే వస్తువులు, అత్యవసర సరుకులు, ఇళ్లల్లో తయారయ్యే వస్తువుల విక్రయాలు కూడా మందంగానే ఉంటోంది.

ఉద్యోగాలులేని అభివృద్ధి వేగవంతమవుతుంది. అందువల్ల బడా వాణిజ్య సంస్థలకు ప్రత్యేకించి అదానీ, అంబానీలకు రాయితీలివ్వడం వల్లనే వృద్ధిరేటు పెరుగుతోంది. గత పదేళ్లుగా మోదీ ప్రభుత్వ కాలంలో అనుసరించిన విధానాల వల్లభారీగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు విధ్వంసం పెద్దఎత్తున జరిగింది. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ, దిగుమతుల పెరుగుదల ఈ పరిశ్రమల రంగాన్ని ధ్వంసం చేసింది. యువతకు రానున్న పదేళ్లలో ఉద్యోగాలు కల్పించడానికి ప్రతి ఏటా మోదీ ప్రభుత్వం 12 మిలియన్ల ఉద్యోగాలు సృష్టించవలసి ఉంటుందని అమెరికా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు ది సిటీ గ్రూపు నివేదిక తెలియజేసింది. జీడీపీ 7శాతం మాత్రమే ఉన్నందువల్ల ఎక్కువ ఉద్యోగాలు సృష్టించడం సాధ్యం కాదని తెలిపింది. హర్యానా(మనేసర్) లోని అమెజాన్ వేర్‌హౌస్‌లో కార్మికచట్టం ఉల్లంఘన జరిగాయి. చెన్నై, ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఫ్యాక్టరీలో మహిళా కార్మికుల పట్ల వివక్షను పాటిస్తున్నారు. అలాగే లే ఆఫ్‌లు ఎక్కువగా ఉన్నాయి. కంపెనీల చట్టం 2013లో వందకుపైగా సవరణలు చేయడం ద్వారా దేశీయ కార్పొరేట్ రంగంలో 'అలసత్వ భారం' తగ్గించడానికి ప్రభుత్వం తలపెట్టింది. బడా వ్యాపారసంస్థల భారాన్ని తగ్గించి వాటి లాభాలు పెంచడానికే ప్రభుత్వం సిద్ధంగా ఉంటుంది. మోదీ రెండోసారి పాలనలో సంపదపై పన్నును రద్దుచేశారు. కార్పొరేట్ సంస్థలు అసలేపన్నులు సక్రమంగా చెల్లించవు. అంతేకాదు, సామాజిక బాధ్యతలనుకూడా నెరవేర్చరు. ఈ నేపథ్యంలో సామాన్యుల కోసం ప్రణాళికలను మోదీ ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తుందా అనేది పెద్దప్రశ్నార్థకం.

వైజ్ఞానికులకు వైజ్ఞానికుడు బుద్ధుడు

డాక్టర్ దేవరాజు మహారాజు

బుద్ధుడు చెప్పిన విషయాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందికి, ఎన్నో రకాలుగా స్ఫూర్తినిచ్చాయి. బుద్ధుడి స్ఫూర్తితోనే ఎంతోమంది తాత్త్వికులయ్యారు. కవులు, రచయితలయ్యారు. రాజకీయ నాయకులయ్యారు. విప్లవ వీరులయ్యారు. సిద్ధాంత కర్తలయ్యారు. మేధావులయ్యారు. వీరు మాత్రమే కాకుండా బుద్ధుడు చెప్పిన ఒక సిద్ధాంతంతో చాలామంది శాస్త్రవేత్తలయ్యారు. పరిశోధకు లయ్యారు. ఆయన చెప్పిన అనేక విషయాలలో ఈ ఒక్క సిద్ధాంతం విశ్వవ్యాప్తంగా ప్రభావం చూపింది. అదేమంటే- 'కార్యకారణ సిద్ధాంతం'. ఆ ఒక్క మాటతో ఆయన వైజ్ఞానికులకే వైజ్ఞానికుడయ్యాడు. ఏ కార్యం జరిగినా, దాని వెనక ఒక కారణం ఉంటుంది. ఆ కారణాన్ని అన్వేషించి, అర్థం చేసుకుంటే గాని దాన్ని నివారించడానికి మార్గాలు వెతుక్కోవచ్చు-అన్నది బుద్ధుడి కార్యకారణ సిద్ధాంతం! ఎక్కడ ఏ ప్రగతీలేని రోజుల్లో మానవ మేధస్సు వికసించని దశలో, బుద్ధుడు సుమారు రెండున్నర వేల ఏళ్ల క్రితం ఆ విషయం చెప్పడం మామూలు విషయం కాదు. ఈరోజు వైజ్ఞానిక ప్రపంచమంతా ఈ సూత్రం చుట్టే తిరుగుతూ ఉండడం మనం గమనించొచ్చు. బుద్ధుడు ఏం చెప్పాడు? ప్రపంచంలో దుఃఖం ఉంది. దానికి కారణముంది. కారణముంది కాబట్టి, నివారణ ఉంది. నివారణ ఉంది కాబట్టి అందుకు మార్గాలున్నాయి- అన్నాడు. దీని మీద ఆధారపడి కారల్‌మార్క్స్ మరో సిద్ధాంతం చెప్పాడు. ఆయన ప్రపంచంలోని పేదరికాన్ని, అణచివేతను, అసమానతను గుర్తించాడు. ఆ విషయాన్నే తన సిద్ధాంతంగా చెప్పాడు. ప్రపంచంలో పేదరికం ఉంది. పేదరికం ఉంది కాబట్టి అసమానత, అణచివేత ఉన్నాయి. పేదరికానికి కారణాలు తెలుసుకుంటేనే, ఆ కారణాలకు నివారణలు తెలుసుకోవచ్చు. ఆ నివారణకు దారులూ సమసమాజ స్థాపన- క్రాంతి- విప్లవం-అని వివరించాడు మార్క్స్! లోతుగా తరచిచూస్తే, మార్క్సిజం, బుద్ధిజం పునాదులపైనే నిర్మాణమైందని అనిపిస్తుంది. నేటి ఆధునిక వైద్య శాస్త్రమైనా ఏం చెబుతుంది? ప్రపంచంలో రోగాలున్నాయి. రోగాలున్నాయి కాబట్టి ఆరోగ్య సమస్యలున్నాయి. అవి ఉండడానికి కారణాలున్నాయి. ఆ కారణాలు బ్యాక్టీరియా, వైరస్‌లే కావచ్చు. వారసత్వ లక్షణాలే కావొచ్చు. మరింకేదైనా కావచ్చు. కారణాలేవైనా అందుకు నివారణలున్నాయి. ఆ నివారణలకు వేర్వేరు దారులున్నాయి. ఆ దారులేమిటీ? చికిత్స, థెరపీ, ఆపరేషన్ వగైరా ఏదైనా కావొచ్చు. ఒక్క వైద్య శాస్త్రమే కాదు, ఇతర అన్ని శాస్త్రాలు ఆ ఒక్క 'కార్యకారణ సిద్ధాంతం' లోంచి వెలువడ్డవే. ఉదాహరణకు తొలి రోజుల్లో మనిషి చేపను చూశాడు. చేప నీటిలో ఈదడం చూశాడు. అది ఎలా తేలగలుగుతుందో, ఎలా ఈదగలుగుతుందో వాటికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం తెలుసుకున్నాడు. కాలక్రమంలో నీటిపై తేలుతూ ప్రయాణించగల పడవకు, ఓడకు, స్టీమర్‌కు రూపకల్పన చేసుకున్నాడు. అలాగే మనిషి పక్షిని గమనించాడు. అది రెక్కలాడిస్తూ, గాలి ఒత్తిడితో పైకి లేవగలగడం అధ్యయనం చేశాడు. దాని వెనక గల కార్యకారణ సంబంధాన్ని అర్థం చేసుకుని విమానాల్ని తయారు చేసుకున్నాడు. గద్ద ఆకాశంలో ఎగురుతూ కింద భూమి మీద గల చిన్న కోడిపిల్లను ఎలా చూడగలుగుతుందో పరిశీలించి, లెన్స్‌ల్ని ఆవిష్కరించు కున్నాడు. దూరపు చూపు, దగ్గరి చూపునకు తగిన కటకాల్ని తయారుచేసుకున్నాడు. ఆవిరి ఎంత బలమైందో జేమ్స్‌వాట్ గ్రహించగలిగాడు కాబట్టి- ఆవిరి యంత్రానికీ, ఇంజన్‌కు, రైలుకు ఆవిష్కరణలు జరిగాయి. ప్రతి కార్యానికీ కారణముంటుందన్న విషయం గ్రహించిన శాస్త్రవేత్తలంతా తమ తమ రంగాలలో పరిశోధనలు కొనసాగించారు. నూతన ఆవిష్కరణలతో విశ్వమానవాళికి మేలు చేస్తూ వచ్చారు. ఈ విషయంలో శాస్త్రవేత్తలంతా బుద్ధుని అనుచరులే! కార్యకారణ సిద్ధాంతం 16 వ శతాబ్దంలో యూరప్‌కు చేరినప్పుడు అక్కడ బేకన్, న్యూటన్, కెప్లర్, గెలీలియో వంటి మహా శాస్త్రవేత్తలంతా తయారయ్యారు. ఈ రకంగా చెప్పాలంటే భారతదేశం 'విశ్వ గురువు' ఎప్పుడో అయిపోయింది. కాస్త చదువూ, జ్ఞానం, విజ్ఞత ఉన్నవారికి ఈ విషయం తెలుస్తుంది. అది లేనివారు ఇప్పుడీ దేశాన్ని కొత్తగా 'విశ్వ గురువు' గా నిలబెడతామని బయలుదేరుతున్నారు. అది వారి అజ్ఞానాన్ని బయటపెడుతుంది. భారతదేశం ప్రపంచానికి ఏమిచ్చిందీ అంటే బుద్ధుణ్ణి ఇచ్చింది. బుద్ధుడు ప్రపంచానికి ఏమిచ్చాడంటే- కార్యకారణ సిద్ధాంతాన్నిచ్చాడు. ఎక్కడ ఏ ఆధారాలూ లేని రోజుల్లో ఏ పరిశీలనలు, ఏ పరిశోధనలూ జరగని రోజుల్లో బుద్ధుడు ఆ సిద్ధాంతాన్ని ఇచ్చాడంటే మాటలా? ఆయనకు జ్ఞానోదయమైందంటే ఇదే- ప్రపంచానికి ఆయన జ్ఞానాన్నిచ్చాడంటే ఇదే! ఆ ఒక్క సిద్ధాంతం మీదే అన్నీ ఆధారపడి ఉన్నప్పుడు, వైజ్ఞానిక పరిశోధనలన్నీ ఇప్పటికీ ఆ సిద్ధాంతం మీదే ఆధారపడి జరుగుతున్నప్పుడు- ఇన్ని శతాబ్దాల తర్వాత మనం ఆయనను ఏ స్థాయిలో నిలుపుకోవాలీ? అందుకే ప్రజలు ఆయనను 'భగవాన్' - అన్నారు. భగవా అని అంటే పరిపూర్ణుడు అని అర్థం! బుద్ధుడు చెప్పిన విషయాలేవీ మిగలక పోయినా, ఈ ఏకవాక్య సిద్ధాంతం మిగిలినా, ఆయన బుద్ధుడిగానే మిగిలి ఉండేవాడు. ఎందుకంటే ఈ ఒక్క ఆలోచనే ప్రపంచ గతిని మార్చింది. ఎన్నో వైజ్ఞానిక సిద్ధాంతాలకు ఇది మూలం అయ్యింది. బీజమైంది. మాతృక అయ్యింది. జీవితానికి సంబంధించి బుద్ధుడు ఎన్నో విలువైన విషయాలు చెప్పాడు. అవన్నీ మానవ ప్రవృత్తికి, సమాజగతికి సంబంధించినవి. ఈ కార్యకారణ సిద్ధాంతం మాత్రం ప్రగతికి, పురోగతికి, అభ్యున్నతికి, విప్లవానికీ సంబంధించింది. శతాబ్దాలు గడుస్తున్నా ఆ సిద్ధాంతం ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ అన్వయించుకునే విధంగా ఉంటూనే ఉంది. తరం తర్వాత తరంలో ఇది మనిషిని ఆధునికుణ్ణి

చేస్తూనే ఉంది. అది నిత్య నూతనం! బుద్ధుణ్ణి ఒక సామాజిక కార్యకర్తగా, సంఘ సంస్కర్తగా, తాత్త్వికుడిగా ముఖ్యంగా మార్గదర్శిగా చూడకుండా ఆయనను దేవుళ్లలో కలపడం, ఆయనకు మతాన్ని పులమడం- ఆలోచనలేని కొందరు చేసిన పిచ్చిపని. పరిపూర్ణుడు గనకనే శతాబ్దాలకు ముందే ఆనాటి ప్రజలు ఆయనను భగవాన్‌గా పూజించారు. శతాబ్దాల తర్వాత ఈనాడు కూడా ఆధునిక ఆలోచనాపరులు ఆయన మేధోశక్తికి అబ్బురపడి ఆరాధిస్తున్నారు. ఆ స్ఫూర్తిని నిలుపుకుని, వచ్చే తరాలకు అందించాలను కుంటున్నారు. పూజ- అంటే అదే. పూలు, కుంకుమ జల్లి, గంటలు మోగించి, అర్థంలేని, అర్థంకాని సంస్కృత శ్లోకాలు అరవడం పూజ కాదు. అది దారి తప్పిన మనువాదుల పైత్యం! వారి దృష్టిలో భగవాన్ అంటే అస్తిత్వం లేనివాడు. కేవలం విశ్వాసంలో తిష్టవేసినవాడు- మాత్రమే! వీరి దేవుడు మనిషి బుర్రలో పుట్టి, మనిషినే బానిసగా లేదా మూర్ఖుడిగా చేసినవాడు మాత్రమే! పదిహేడవ శతాబ్దంలో బుద్ధుడి కార్యకారణ సిద్ధాంతం అందుబాటు లోకి వచ్చిన తర్వాతనే యూరప్‌లో వైజ్ఞానిక విప్లవం వచ్చింది. అంతకు ముందు అక్కడ ఏదైనా జరిగిందంటే దానికి కారణం ధార్మిక, ఆధ్యాత్మిక, దైవ కారణాల్ని వెతుక్కునేవారు. ఇది అప్పటి వారి రచనల్లో దొరికిన అంశమే. బుద్ధుడు తన బోధనల్ని నాటి ప్రజల భాష అయిన పాలి భాషలో బోధించాడు. అందువల్ల అతడి బోధనలతో పాటు ఆ పాలి భాష ప్రభావం ఇతర దేశాల మీద కూడా పడింది. ఉదాహరణకు కొన్ని ముఖ్యమైన పదాలు చూద్దాం. ధ్యానాన్ని పాలి భాషలో 'ఝాన్' అంటారు. దాన్ని మన భారతదేశంలో వైదిక మతస్థులు ధ్యానంగా మార్చారు. ఇదే పదం చైనాకు పోయి 'చాన్' అయ్యింది. అక్కడ 'చాన్' సంప్రదాయం ఏర్పడింది. అలాగే పాలి భాషలోని ఝాన్ పదం జపాన్‌లో జేన్ అయ్యింది. అది పాటించే 'జేన్' సంప్రదాయం అక్కడ వర్ధిల్లింది. ఇదే ఝాన్ కొరియాలో 'సార్ జాన్' అయ్యింది. వియత్నాంలో 'థియాన్' అయ్యింది. ఇలా వేరు వేరు దేశాల్లో ఆ పదం వేరు వేరుగా వ్యాపించింది. ఇంతెందుకూ? మనం మన ఊళ్ల పేర్లలో సామాన్యంగా 'పల్లి' అని ఉండడం చూస్తుంటాం. అది పాలి భాషలోంచి వచ్చిందే. ఇరాండ్ పల్లి- అనే ఊరు అశోకుడి శాసనాలలో కూడా కనిపించింది. పల్లి అంటే పాలి భాషలో నగరం అని అర్థం. పర్షియా రాజధాని పర్సిపోలస్‌లో పోలిస్ అంటే నగరం- అనే అర్థం ఉంది. ఇవన్నీ బుద్ధుడి బోధనలతో పాటు వేర్వేరు భాషల్లోకి ప్రవేశించిన పదాలు. అందుకే మూలాల్లోకి వెళ్లాలి. డాక్టర్ రామ్ విలాస్ శర్మ వృత్తిరీత్యా ఇంగ్లీషు ప్రొఫెసర్. భాషా శాస్త్రజ్ఞుడు కూడా. బౌద్ధ మతాభిమాని అయినందువల్ల ఆ విషయాలలో విస్తృతంగా పరిశోధనలు చేశారు. పాలి భాషా పదాలు వివిధ దేశాలకు ఎలా ప్రయాణించాయన్న విషయం ఆయన చాలా వివరంగా రాశారు. థెరపీ/ థియరీ వంటి పదాల గురించి కూడా ఆయన వివరణ ఇచ్చారు. తార్కిక విశ్లేషణలతో లభించేది 'థేర్' అని పాలి భాషలో బౌద్ధం చెపుతుంది. ఆస్థా (నమ్మకం- విశ్వాసం) నుంచి వేదాలు వచ్చినట్లుగా తార్కిక దృక్పథంతో 'థేర్' వచ్చింది. థేర అంటే పెద్దవారు. అన్నీ తెలిసిన విజ్ఞుడు అని అర్థం. (థేరవాద: బౌద్ధంలో ముఖ్యమైన శాఖ) వైజ్ఞానిక రంగంలో ఏ సాంకేతిక పదం కనిపించినా దాని మూలం ఇటాలియన్, లాటిన్, గ్రీకు అని చెపుతుంటారు కదా? చాలా కాలానికి ముందు ఈ 'థేర్' అనుయాయులే ఈజిప్టులో 'థేరాపుటి' అని పిలిచేవారు. వీరు చికిత్సకులు. వీరి వల్లనే థెరపి/ థియరీ వంటి పదాలు విశ్వవ్యాప్తమయ్యాయి. వైదిక మతస్థులు సృష్టించుకున్న ముప్పయి మూడుకోట్ల దేవీ దేవతల్లో ఏ ఒక్కరూ సజీవంగా పుట్టి మనిషికి దిశా నిర్దేశం చేసినవారు లేరు. ఇతర మతాలలో కూడా అదే పరిస్థితి అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మత గురువులు ఉన్నారే గానీ, అసలు 'దైవం' వంటి వారు ఎవరూ లేరు. కనీసం ఏదో ఓ కాలంలో ఉండి అంతరించి పోయారన్న ఆధారాలు కూడా లేవు. ఈ తేడాను గమనించి అర్థం చేసుకోగల స్థోమత గలవారికి మాత్రమే విషయం అర్థమవుతుంది. ఏదో ఒక మత విశ్వాసంలో బలంగా పాతుకుపోయిన వారికి బహుశా ఈ విషయాలు నచ్చకపోవచ్చు. అబద్ధాల్లో సుఖాల్ని వెతుక్కునే వారికి నిజాలు ఇబ్బందిగానే ఉంటాయి.

– సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త

విశాలాంధ్ర

5

ఆదివారం
14 జులై 2024

చాందిపుర వైరస్ కలకలం

రాజస్థాన్‌లో నలుగురు చిన్నారుల మృతి

హిమత్‌నగర్: గుజరాత్‌లోని సబర్‌కాంతా జిల్లాలో చాందిపుర వైరస్ సోకి నలుగురు పిల్లలు మృతిచెందారు. మరో ఇద్దరు చిన్నారులు చికిత్స పొందుతున్నారు. హిమత్‌నగర్ జిల్లా కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిలో చిన్నారులకు చికిత్స జరుగుతోంది. చాందిపుర వైరస్ కేసుల్లో జ్వరం లక్షణాలు కనిపిస్తాయి. ఆ వైరస్ సోకిన వారికి ఫ్లూ లాంటి లక్షణాలు కూడా ఉంటాయి. తీవ్రస్థాయి ఇన్‌సెఫలైటిస్ కూడా వస్తుంది. దోమలు, పురుగుల ద్వారా ఆ వైరస్ వ్యాప్తి చెందుతుంది. ఆరుగురు చిన్నారులకు చెందిన రక్తపు నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపారు. ఆ నమూనాల ఫలితాల కోసం ఎదురుచూస్తున్నట్లు సబర్‌కాంత జిల్లా ఆరోగ్యశాఖ అధికారి రాజ్ సుతారియా తెలిపారు. జులై పదో తేదీన నలుగురు చిన్నారులు చాందిపుర వైరస్ సోకి మృతిచెందినట్లు తొలుత హిమత్‌నగర్ ఆస్పత్రి పీడియాట్రిక్ డాక్టర్లు అనుమానాలు వ్యక్తం చేశారు.అయితే ఆ పిల్లల లక్షణాలే మరో ఇద్దరిలో గమనించినట్లు చెప్పారు. చాందిపుర వైరస్ వల్ల మృతిచెందిన వారిలో ఒకరు సబర్ కాంత్ జిల్లా వాసి కాగా, ఇద్దరు ఆరావలి జిల్లా వాసులున్నారు. నాలుగవ చిన్నారి మాత్రం రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి. ప్రస్తుతం చికిత్స పొందుతున్న ఇద్దరు కూడా రాజస్థానీయులే. రక్షణాత్మక చర్యల్లో భాగంగా ప్రభావిత ప్రాంతాల్లో రెక్కల పురుగులను చంపనున్నారు.

కేజ్రీవాల్ జీవితంతో ఆడుకుంటున్నారు

బీజేపీ, కేంద్రంపై ఆప్ ఎంపీ ధ్వజం

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జీవితంతో బీజేపీ, కేంద్రంలోని దాని ప్రభుత్వం ఆడుకుంటున్నాయని ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ శనివారం విమర్శించారు. 8.5 కిలోల బరువు తగ్గిన కేజ్రీవాల్, జైలులో ఉన్న సమయంలో రక్తంలో చక్కెర స్థాయి ఐదుసార్లు 50 ఎంజీ/డీఎల్ కంటే తక్కువగా పడిపోయాయి. కాగా సంజయ్ సింగ్ ఆరోపణలపై బీజేపీ వెంటనే స్పందించలేదు. 'కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితి ఏమిటంటే, ఆయనను త్వరగా జైలు నుంచి బయటకు తీసుకువచ్చి వైద్యం అందించకపోతే, ఆయనకు ఏదైనా తీవ్రమైన సంఘటన జరగవచ్చు' అని సింగ్ ఇక్కడ విలేకరుల సమావేశంలో అన్నారు. మద్యం పాలసీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసినప్పుడు కేజ్రీవాల్ బరువు 70 కిలోలు అని ఆయన చెప్పారు. ఇప్పుడు తన బరువు 61.5 కిలోలకు తగ్గిందని తెలిపారు. 'ఎటువంటి పరీక్షలు నిర్వహించనందున ఆయన బరువు నిరంతరం తగ్గడానికి కారణం తెలియదు. ఈ బరువు తగ్గడం కొన్ని తీవ్రమైన అనారోగ్యానికి సంకేతం' అని సింగ్ పేర్కొన్నారు. జైలులో ఉన్న కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన కుటుంబం, ఆప్, శ్రేయోభిలాషులు ఆందోళన చెందుతున్నారని సంజయ్ సింగ్ అన్నారు. 'కేజ్రీవాల్‌ను జైలులో ఉంచి ఆయన జీవితంతో ఆడుకోవడమే బీజేపీ, కేంద్రంలోని దాని ప్రభుత్వ లక్ష్యం. ఆయన కొన్ని తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనేలా వారు కుట్ర పన్నుతున్నారు' అని ఆరోపించారు. ఈడీ నమోదు చేసిన కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రికి సుప్రీం కోర్టు శుక్రవారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే మద్యం పాలసీ కుంభకోణం కేసులో అరెస్టు చేసినందున ఆయన ఇప్పటికీ జైలులోనే ఉన్నారు.

పేరడీ ఖాతా నుంచి ఫేక్ పోస్టు

యూట్యూబర్ ధ్రువ్ రాఠీపై కేసు

ముంబై: ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీపై మహారాష్ట్ర సైబర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ధ్రువ్ రాఠీ పేరిట ఉన్న ఓ 'పేరడీ 'ఎక్స్' ఖాతా నుంచి నకిలీ సమాచారాన్ని వ్యాప్తి చేసిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె అంజలి... యూపీఎస్సీ పరీక్షకు హాజరవ్వకుండానే ఉత్తీర్ణత సాధించినట్లు 'ఎక్స్' ఖాతాలో తప్పుడు సమాచారం పోస్టు చేసినట్లు సైబర్ విభాగం వెల్లడించింది. బిర్లా బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపింది. ఆ 'ఎక్స్' అకౌంట్ బయోలో మాత్రం 'ఇది ఫ్యాన్, పేరడీ ఖాతా. ధ్రువ్ రాఠీ అసలైన అకౌంట్‌తో దీనికి ఎటువంటి సంబంధం లేదు' అని రాసి ఉంది. ఇదే విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా... ఈ విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఆ పేరడీ ఖాతా నుంచి శనివారం మరో ట్వీట్ వచ్చింది. 'సైబర్ విభాగం సూచనల మేరకు సంబంధిత పోస్టులు, వ్యాఖ్యలన్నింటినీ తొలగించాను. వాస్తవాల గురించి తెలియక వేరొకరి ట్వీట్‌లను కాపీ చేసి షేర్ చేసినందుకు క్షమాపణలు' అని అందులో రాసుకొచ్చారు.

ఇది ప్రజాస్వామ్య హత్య

జమ్మూకశ్మీర్ ఎల్జీకి మరిన్ని అధికారాలపై విపక్షాలు

శ్రీనగర్ : పోలీసులు, అఖిల భారత సర్వీసు అధికారులకు సంబంధించిన విషయాలపై నిర్ణయాలు తీసుకునేందుకు కేంద్రపాలిత ప్రాంతం లెఫ్టినెంట్ గవర్నర్‌కు మరిన్ని అధికారాలు కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ చర్యను జమ్మూకశ్మీర్‌లోని రాజకీయ పార్టీలు శనివారం తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రధాన ప్రాంతీయ పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) ఈ నిర్ణయం జమ్మూకశ్మీర్ ప్రజలను 'నిరుత్సాహపరుస్తుంది' అని తెలిపాయి. కాంగ్రెస్ దీనిని 'ప్రజాస్వామ్య హత్య' అని పేర్కొంది. అన్ని పార్టీలు విభేదాలకు దూరంగా ఉండి ఐక్యంగా ఈ చర్యకు వ్యతిరేకంగా నిరసన తెలపాలని అప్నీ పార్టీ కోరింది. ఎన్‌సీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ ప్యూన్‌ను నియమించమని లెఫ్టినెంట్ గవర్నర్‌ను వేడుకోవాల్సిన 'బలహీనమైన, రబ్బర్ స్టాంప్' ముఖ్యమంత్రి కంటే జమ్మూకశ్మీర్ ప్రజలు మంచి అర్హత కలిగి ఉన్నారని అన్నారు. అయితే, ఈ చర్య జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు సమీపిస్తున్నాయనడానికి మరొక సూచిక అని మాజీ ముఖ్యమంత్రి తెలిపారు. అందుకే జమ్మూకశ్మీర్ కోసం పూర్తి, పలచబడని రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం కాలక్రమాన్ని నిర్దేశించే దృఢ నిబద్ధత ఈ ఎన్నికలకు అవసరమన్నారు. ఎన్‌సీ ప్రధాన అధికార ప్రతినిధి తన్వీర్ సాదిక్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజలను 'బలహీనపరచడానికి' తీసుకున్న ఈ నిర్ణయాన్ని 'అధికార దుర్వినియోగం'గా అభివర్ణించారు. 'ఇది జమ్మూకశ్మీర్ ప్రజల ప్రజాస్వామ్య స్వరాన్ని బలహీనపరచడం మాత్రమే లక్ష్యంగా ఉంది. ఎన్నికయిన ప్రభుత్వానికి బదులుగా ఎన్నికకాని లెఫ్టినెంట్ గవర్నర్‌కు అధికారాలు ఇవ్వాలనే కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయ్యే ప్రభుత్వ భవిష్యత్‌ను అణగదొక్కే స్పష్టమైన ప్రయత్నం' అని ఆయన చెప్పారు. జమ్మూకశ్మీర్ ప్రజలను శక్తివంతం చేయడంలో ఢిల్లీ ఎంత నిర్లక్ష్యంగా ఉందో ఈ ఉత్తర్వులు తెలియజేస్తున్నాయన్నారు. పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ కుమార్తె, ఆమె మీడియా సలహాదారు ఇల్తిజా ముఫ్తీ మాట్లాడుతూ జమ్మూకశ్మీర్‌లో ఎన్నికయిన ప్రభుత్వ అధికారాలను నిర్వీర్యం చేయడానికి ఈ ఉత్తర్వు ప్రయత్నిస్తుందని తెలిపారు. 'ఈ ఉత్తర్వు తదుపరి జమ్మూకశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తుంది. ఎందుకంటే జమ్మూకశ్మీరీలపై తన ఉక్కు పట్టును వదులుకోవడం లేదా కోల్పోవడం బీజేపీకి ఇష్టం లేదు. రాష్ట్రానికి హోదా ప్రశ్నార్థకం కాదు. జమ్మూకశ్మీర్‌లో ఎన్నికయిన ప్రభుత్వం మున్సిపాలిటీగా కుదించబడుతుంది' అని ఆమె 'ఎక్స్' లో పోస్ట్‌లో పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (జేకేపీసీసీ) అధ్యక్షుడు వికార్ రసూల్ వనీ ఈ చర్యను 'ప్రజాస్వామ్య హత్య' గా అభివర్ణించారు. 'సరైన ప్రజాస్వామ్యం, రాష్ట్ర హోదా పునరుద్ధరణకు ముందే జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్యం హత్యకు గురైంది. ఎల్జీకి పోలీసు, శాంతిభద్రతలతో సహా మరిన్ని అధికారాలను ఇచ్చింది. అధికారుల బదిలీలు తదితరాలు ఎల్‌జీకి అప్పగించబడ్డాయి' అని 'ఎక్స్' లో పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లోని రాజకీయ పార్టీలు విభేదాలకు దూరంగా ఉండి ఐక్యంగా కేంద్రం చర్యకు వ్యతిరేకంగా గళం విప్పాలని అప్నీ పార్టీ అధినేత అల్తాఫ్ బుఖారీ విజ్ఞప్తి చేశారు. ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రం జమ్మూకశ్మీర్‌లో 'శక్తిలేని అసెంబ్లీ'ని ఏర్పాటు చేయాలని భావిస్తే అది ఆమోదయోగ్యం కాదని అన్నారు. 'ముఖ్యమంత్రి దంతాలు లేని పులిలా ఉండాలని, ప్రజలను మోసం చేయాలని వారు కోరుకుంటే, ఇది జమ్మూకశ్మీర్ ప్రజలు ఎదుర్కొంటున్న ఏ సమస్యలను పరిష్కరించగలదని నేను అనుకోను' అని ఆయన అన్నారు.

అనంత్ పెళ్లిలో లాలూకు ప్రత్యేక స్వాగతం

ముంబై: రిలయన్స్ చైర్మన్ ముఖేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ఆయన ఫార్మా టైకూన్ వీరేన్, శైలా మర్చంట్‌ల కుమార్తె రాధికా మర్చంట్‌ను వివాహం చేసుకున్నారు. ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో వీరి వివాహం జరిగింది. ఈ పెళ్లికి హాజరైన వారిలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ యాదవ్ కూడా ఉన్నారు. లాలూ యాదవ్‌తో పాటు ఆయన భార్య రబ్రీదేవి, కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్, కుమార్తె మిసా భారతి కూడా వివాహ వేడుకలో పాల్గొన్నారు. లాలూ కుటుంబ సభ్యులను అనంత్ అంబానీ చిన్నాన్న అనిల్ అంబానీ, చిన్నమ్మ టీనా అంబానీ ప్రత్యేకంగా స్వాగతించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ తన భార్య డింపుల్ యాదవ్‌తో సహా వివాహానికి విచ్చేశారు. అలాగే గోరఖ్‌పూర్ బీజేపీ ఎంపీ రవి కిషన్ తన భార్యతో కలిసి వచ్చారు. కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్ తదితరులు కూడా అనంత్ అంబానీ, రాధికా మర్చెంట్‌ల వివాహానికి హాజరయ్యారు.

లాలూజీ... వీల్‌చైర్ ఎక్కడ: ఎన్డీయే

ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ వివాహానికి దేశ విదేశాల నుంచి ప్రముఖులు హాజరయ్యారు. ఇండియా ఐక్యసంఘటన నుంచి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, శివసేన-యుబీటీ అధినేత ఉద్ధవ్ ఠాక్రే, ఎన్‌సీపీ-ఎస్పీ నేత సుప్రియా సూలే, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ హాజరయ్యారు. అయితే ఎప్పుడూ వీల్ చైర్‌పై కనిపించే లాలూ... అనంత్ అంబానీ వివాహానికి వీల్ చైర్ సాయం లేకుండా వచ్చారు. దీంతో అధికార ఎన్డీయే కూటమి నేతలు ఆయనపై విమర్శలు గుప్పించారు. దర్యాప్తు సంస్థల దాడులు జరుగుతున్నప్పుడు, జైలుకు వెళ్లాల్సిన సందర్భంలో మాత్రమే సానుభూతి పొందేందుకు లాలూ ప్రసాద్ యాదవ్ వీల్‌చైర్ ఉపయోగిస్తారని ఎన్డీయే నేతలు విమర్శించారు. ఈ ఆరోపణలను ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు ఖండించారు. వివాహ వేడుకకు హాజరైన లాలూ... అనంత్, రాధిక మర్చంట్‌లను ఆశీర్వదించారు.

అమరవీరుడి భార్యపై కామెంట్లు

నిందితుడిపై ఢిల్లీ పోలీసుల కేసు

న్యూఢిల్లీ: అమరవీరుడి భార్యపై అభ్యంతరకర పోస్టు పెట్టిన ఓ నెటిజన్‌పై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. శనివారం దీనిపై కేసు నమోదైంది. జాతీయ మహిళా కమిషన్ ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. ఆ కామెంట్లు చేసిన నెటిజన్ అకౌంట్ వివరాల కోసం సంబంధిత సోషల్ మీడియా సంస్థను సంప్రదించినట్లు తెలిపారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన భారత సైనికుడు అంశుమాన్ సింగ్ త్యాగానికి గుర్తుగా భారత ప్రభుత్వం కీర్తి చక్ర అవార్డు ప్రకటించింది. ఇటీవల ఆయన సతీమణి స్మృతిసింగ్ రాష్ట్రపతి చేతులమీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఆ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో యావత్ భారతదేశం అమరవీరుడి కుటుంబాన్ని కీర్తించింది. అవార్డు స్వీకరించే సమయంలో ఆమె ముఖం చూసిన దేశ ప్రజల కళ్లు చెమర్చాయి. కానీ కొందరు మాత్రం ఆ వీడియోపై అభ్యంతరకర కామెంట్లు పెట్టడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఢిల్లీకి చెందిన అహ్మద్ అనే వ్యక్తి అసభ్యకరంగా చేసిన కామెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు జాతీయ మహిళా కమిషన్‌ను కోరారు. దీనిపై స్పందించిన మహిళా కమిషన్ ఆ యువకుడి చర్యను తీవ్రంగా ఖండించింది. ఢిల్లీ పోలీసులు తక్షణమే అతడిని అరెస్టు చేయాలని ఆదేశించింది. దీంతో ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 26వ బెటాలియన్ పంజాబ్ రెజిమెంట్‌కు చెందిన కెప్టెన్ అంశుమాన్ సింగ్ గతేడాది జులై 19న విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు.

సొంత పార్టీ నేతలకు గడ్కరీ హెచ్చరిక

పనాజీ: బీజేపీ సీనియర్ నేత, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సొంత పార్టీ శ్రేణులనే సున్నితంగా హెచ్చరించారు. బీజేపీ గోవా రాష్ట్ర కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పలు అంశాలపై ప్రసంగించారు. 'కాంగ్రెస్ చేసిన తప్పులనే మనం మళ్లీ చేస్తే వారికి మనకు తేడా ఏం ఉండదు. బీజేపీ అంటేనే ఒక ప్రత్యేకత కలిగిన పార్టీ. అందుకే మనల్ని ప్రజలు పదే పదే నమ్మి అధికారం కట్టబెడుతున్నారు. రాజకీయాలు సామాజిక, ఆర్థిక సంస్కరణలు తీసుకురావడానికేనని బీజేపీ క్యాడర్ తెలుసుకోవాలి. అవినీతి రహిత భారత్ కోసం కృషి చేయాలి. ఇందుకోసం మన దగ్గర ఒక ప్రణాళిక ఉండాలి. కుల రాజకీయాలు చేయకూడదు. అలా చేస్తే ప్రతిచర్య కూడా గట్టిగా ఉంటుంది'అని గడ్కరీ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ సొంతగా మెజారిటీ దక్కించుకోలేకపోయిన నేపథ్యంలో గడ్కరీ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.

మోదీ సర్కార్ నిర్ణయంలో ఆశ్చర్యమేముంది?

రాజ్యాంగ హత్యాదినంపై ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ: దేశంలో అత్యవసర పరిస్థితిని విధించిన జూన్ 25ను ఇక నుంచి ఏటా 'రాజ్యాంగ హత్యాదినం' (సంవిధాన్ హత్యాదివస్)గా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ స్పందించారు. మోదీ సర్కార్ తీసుకున్న చర్యలపై మండిపడ్డారు. రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చి ప్రతికూల రాజకీయాలకు పాల్పడేవారు ఇలా చేయడంలో వింతేమీ లేదని విమర్శించారు. 'దేశంలోని గొప్ప వ్యక్తులు కలిసికట్టుగా స్వాతంత్ర్యాన్ని మాత్రమే కాకుండా రాజ్యాంగాన్ని రూపొందించుకున్నారు. కానీ, కేంద్రంలోని మోదీ సర్కార్ ఎప్పటి నుంచో రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తోంది. దాన్ని రద్దు చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ప్రతికూల రాజకీయాలకు పాల్పడేవారు 'సంవిధాన్ హత్యాదివస్' ప్రకటించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. రాజ్యాంగంపై విశ్వాసం ఉన్నవారు మాత్రమే పరిరక్షణ కోసం పోరాడుతున్నారు' అని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. నాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 1975 జూన్ 25న దేశంలో ఎమర్జెన్సీ విధించిన సంగతి తెలిసిందే. ఆమె ప్రజాస్వామ్యం గొంతు నులిమేశారని, కారణం లేకుండా లక్షలాది మందిని జైల్లో పెట్టారని ఎన్డీయే సర్కార్ గుర్తు చేసింది. ఆ చీకటి రోజులకు నిరసనగా ఇక నుంచి ఏటా జూన్ 25ను 'సంవిధాన్ హత్యాదివస్'గా నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. దీనిపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇదంతా ప్రధాని మోదీ అధ్వర్యంలో జరుగుతున్న మరో కపట ప్రచార ఎత్తుగడ అని పేర్కొంది.

మనుస్మృతి కాపీలు దహనం చేసే దమ్ముందా?

మోదీ, రాహుల్‌కు ప్రకాశ్ అంబేద్కర్ సవాల్

ముంబై: ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నిజంగా భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తే... అప్పుడు వాళ్లు మనుస్మృతి కాపీలు తగులబెట్టాలని వంచిత్ బహుజన్ అగాధీ వ్యవస్థాపకుడు ప్రకాశ్ అంబేద్కర్ సవాల్ విసిరారు. రాజ్యాంగాన్ని రాసిన బాబా సాహెబ్ అంబేద్కర్ మనువడు ప్రకాశ్ అంబేద్కర్ ఓ న్యాయవాది, రాజకీయవేత్త, సామాజిక కార్యకర్త. గతంలో రాజ్యసభ, లోక్‌సభ సభ్యుడిగా చేశారు. ఒకవేళ బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నిజంగా రాజ్యాంగాన్ని ప్రేమిస్తే... అప్పుడు మనుస్మృతి కాపీలు తగులబెట్టాలని మోదీ, రాహుల్‌ను డిమాండ్ చేస్తున్నట్లు ప్రకాశ్ అంబేద్కర్ తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగానికి వెన్నుపోటు పొడిచాయన్నారు. పేదలను, అణగారిన కులాలను ఆ పార్టీలు మోసం చేశాయన్నారు. రాజ్యాంగంలో బాబా సాహెబ్ అంబేద్కర్ పొందుపరిచిన ఆశయాలకు, విలువలకు ఆ పార్టీలు తూట్లు పొడిచాయని ప్రకాశ్ అంబేద్కర్ ఆరోపించారు.

వరదోగ్రరూపం

ఉప్పొంగుతున్న నదులు

కొట్టుకుపోతున్న ఇళ్లు... రహదారులు

జలదిగ్బంధంలో పల్లెలు, పట్టణాలు

జనజీవనం అస్తవ్యస్తం

లక్నో/డెహ్రాడూన్: ఉత్తర భారతదేశంలో వరదలు వణికిస్తున్నాయి. భారీ వర్షాల బీభత్సానికి పట్టణం, పల్లెలు అన్న తేడాలేకుండా జలదిగ్బంధంలో తేలియాడుతున్నాయి. నదుల ఉగ్రరూపానికి నామరూపాలు లేకుండా పోతున్నాయి. ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. చాలాచోట్ల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రవాణావ్యవస్థ స్తంభించిపోతోంది. భారీ వర్షాలకు తోడు నేపాల్ నుంచి వస్తున్న వరదనీరు ఉత్తరప్రదేశ్‌ను అతలాకుతలం చేస్తోంది. రాష్ట్రంలోని బహ్రైచ్, శ్రావస్తి, గోండా, బలరాంపూర్, అయోధ్య, అంబేద్కర్ నగర్, బారాబంకి, సీతాపూర్ పరిధిలోని దాదాపు 250 గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. లఖింపూర్ ఖేరీలోని 150 గ్రామాలు, షాజహాన్‌పూర్‌లోని 30, బదౌన్‌లోని 70, బరేలీలోని 70, పిలిభిత్‌లోని 222 గ్రామాలకు చెందిన ప్రజలు వరద నీటిలోనే కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరదల కారణంగా పూర్వాంచల్‌లోని బల్లియాలో పలు ఇళ్లు కొట్టుకుపోయాయి. వరుసగా రెండో రోజు ఢిల్లీ-లక్నో హైవేపై గర్రా నది వరద నీటితో నిండిపోవడంతో ఈ మార్గంలో అధికారులు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. మొరాదాబాద్- లక్నో మధ్య 22 రైళ్లను నెమ్మదిగా నడుపుతున్నారు. షాజహాన్‌పూర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలోకి వరద నీరు చేరడంతో బాధితులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. షాజహాన్‌పూర్ నగర శివార్లలోని హౌసింగ్ డెవలప్‌మెంట్ కాలనీతో సహా ఇతర లోతట్టు ప్రాంతాలకు చెందిన సుమారు 10 వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం 225 మందిని రక్షించింది. ఎస్ఎస్ కళాశాల లైబ్రరీలోని వందల పుస్తకాలు నీట మునిగాయి. ఖేరీ, షాజహాన్‌పూర్, బరేలీకి చెందిన ఆరుగురు వరద నీటిలో కొట్టుకుపోయారు.

ఉత్తరాఖండ్‌లో కాళీనది...

ఉత్తరాఖండ్‌లోకి ప్రవేశించిన రుతుపవనాలు ఉగ్రరూపాన్ని దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. నదులన్నీ ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గడ్డివాములు నదుల్లోకి చేరుతున్నాయి. రోడ్లపై చేరిన చెత్తాచెదారం రహదారులను మూసేస్తోంది. భారత్-నేపాల్ సరిహద్దులోని ధార్చులలో గల కాళీనది ఉగ్రరూపాన్ని దాల్చింది. సమీప ప్రాంతాల్లోని ప్రజలంతా అప్రమత్తం కావాలని స్థానిక యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం ఆయా ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తోంది. కాళీనదిలోని నీటి మట్టం అంతకంతకూ పెరుగుతోంది. పలుచోట్ల రహదారులు కొట్టుకుపోయాయి. కాళీనది ఉగ్ర రూపానికి సంబంధించిన పలు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. భారీ వర్షాల కారణంగా పలుచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. వంతెనలు కూలిపోవడంతో పాటు పలు రహదారులు మూసుకుపోయాయి. రాష్ట్రంలోని ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

మీ ఫోన్‌లో 'హానికరమైన స్పైవేర్'

కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్‌ను హెచ్చరించిన ఆపిల్

న్యూఢిల్లీ : కాంగ్రెస్‌కు చెందిన అలప్పుజా ఎంపీ, పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జ్ కె.సి.వేణుగోపాల్ శనివారం తన ఫోన్‌లో 'హానికరమైన స్పైవేర్' గుర్తించడంతో అప్రమత్తమయ్యారు. 'నా ఫోన్‌లో కూడా మీకు ఇష్టమైన హానికరమైన స్పైవేర్‌ను పంపినందుకు ధన్యవాదాలు ప్రధాని మోదీ జీ' అని వేణుగోపాల్ 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) లో ఒక పోస్ట్‌లో రాశారు. 'మీ ఈ ప్రత్యేక బహుమతి గురించి నాకు తెలియజేయడానికి యాపిల్ దయ చూపింది!' అని పేర్కొన్నారు. టెలిగ్రాఫ్ ఆన్‌లైన్ ఈ వారం ప్రారంభంలో జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీకి పంపిన హెచ్చరికను నివేదించింది. 2021 అసెంబ్లీ ఎన్నికలలో పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కి వ్యతిరేకంగా బీజేపీ గెలిచిన మూడు సీట్లను కోల్పోయిన రోజున వేణుగోపాల్‌కు ఈ హెచ్చరిక వచ్చింది. దేశవ్యాప్తంగా ఉప ఎన్నికలు జరిగిన 13 సీట్లలో కేవలం రెండు స్థానాల్లో మాత్రమే బీజేపీ ముందంజలో ఉంది. 2023 అక్టోబరు 30న ఆపిల్ వేణుగోపాల్‌కు ఇలాంటి హెచ్చరికను పంపింది. సామాజిక మాధ్యమ వేదికపై కాంగ్రెస్ నాయకుడు పంచుకున్న ఆపిల్ హెచ్చరిక స్క్రీన్‌షాట్‌లో, 'ఇది పునరావృతమయ్యే నోటీసు కాదు. మేము మీ పరికరంపై మరొక దాడిని గుర్తించినట్లు మీకు తెలియజేస్తున్నాం' అని ఉంది. ఇల్తిజా ముఫ్తీ విషయంలో మాదిరిగానే, ఆపిల్ వేణుగోపాల్‌ను హెచ్చరించింది. ఆయనను ఎవరో లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపింది. 'ఈ దాడి మీరు ఎవరో లేదా మీరు చేసే పనుల కారణంగా ప్రత్యేకంగా మిమ్మల్ని లక్ష్యంగా చేసుకుని ఉండవచ్చు. అటువంటి దాడులను గుర్తించేటప్పుడు సంపూర్ణ నిశ్చయతను సాధించడం ఎప్పటికీ సాధ్యం కానప్పటికీ, ఆపిల్ ఈ హెచ్చరికపై అధిక విశ్వాసాన్ని కలిగి ఉంది. దయచేసి దీనిని తీవ్రంగా పరిగణించండి' అని పేర్కొంది. వేణుగోపాల్ ఇలా రాశారు. 'మోదీ ప్రభుత్వం నేరపూరితంగా, రాజ్యాంగ విరుద్ధమైన రీతిలో వ్యవహరిస్తోందని, రాజకీయ ప్రత్యర్థుల వెంటే వెళుతోందని, వారి గోప్యతను ఈ విధంగా ఆక్రమిస్తోందని స్పష్టంగా చెప్పండి. లోక్‌సభ ఎన్నికల సందేశం రాజ్యాంగం, బీజేపీ ఫాసిస్ట్ అజెండాపై ఎటువంటి దాడినైనా ప్రజలు తిరస్కరించారు. మేము ఈ రాజ్యాంగ విరుద్ధమైన మా గోప్యతను ఉల్లంఘించే చర్యను వ్యతిరేకిస్తాం' అని పేర్కొన్నారు.

మెహబూబా ముఫ్తీ గృహ నిర్బంధం

కశ్మీర్: జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీని గృహ నిర్బంధం చేశారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. కశ్మీర్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా 'మజార్ ఏ షుహదా'ను సందర్శించకుండా తనను అడ్డుకునేందుకు చేస్తున్న ప్రయత్నమని ఆమె ఆరోపించారు. 'మజార్ ఏ షుహదాను సందర్శించకుండా చేసేందుకు నన్ను గృహనిర్బంధం చేశారు. మరోసారి మా ఇంటి గేటుకు తాళాలు వేశారు. కశ్మీర్ ప్రజల స్ఫూర్తిని అణచివేయలేరన దానికి అమరవీరుల త్యాగాలే నిదర్శనం. వారికి నివాళులర్పించడాన్ని నేరంగా పరిగణిస్తున్నారు. ఇలాంటి చర్యల ద్వారా మన హక్కులు, గౌరవాన్ని కాపాడుకునేందుకు పోరాటం చేయాలనే మన సంకల్పాన్ని మరింత బలపరుస్తాయి' అని 'ఎక్స్' వేదికగా మెహబూబా ముఫ్తీ పేర్కొన్నారు.

2031కి రెండవ ఆర్థిక వ్యవస్థగా భారత్

ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్

న్యూఢిల్లీ: భారత్ 2031నాటికి ప్రపంచంలోని రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) డిప్యూటీ గవర్నర్ మైఖేల్ దేవాబ్రత పాత్ర అన్నారు. 2048 నాటికి కొనుగోలు శక్తిలో అమెరికాను మించిపోతుందన్నారు. 2060 నాటికి అగ్రస్థానానికి చేరుతుందని అంచనా వేశారు. ఆర్థిక సహకారం, అభివృద్ధి వ్యవస్థ (ఓఈసీడీ) అంచనాల మేరకు కొనుగోలు శక్తి తుల్యత (పీపీపీ)లో అమెరికాను మించిపోగలదన్నారు. పీపీపీ లెక్కన ప్రస్తుతం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉన్నట్లు తెలిపారు. ముస్సోరీలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన మైఖేల్ ఈ వివరాలు తెలిపారు. ఆర్థిక సుస్థిరత గురించీ మాట్లాడారు. బ్యాంకింగ్ వ్యవస్థలో స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీలు) 2018 మార్చి నుంచి పోల్చితే ప్రస్తుతం తగ్గాయని, ఈఏడాది మార్చికి 2.8శాతంగా ఉన్నాయని తెలిపారు. నికర ఎన్‌పీఏలు కేవలం 0.6శాతంగా ఉన్నట్లు వెల్లడించారు. పెట్టుబడులు, లిక్విడిటీ బఫర్ల స్థితి మెరుగ్గా ఉన్నట్లు చెప్పారు. ఈ ఏడాది మార్చికి జీడీపీలో 81.6శాతంగా అంచనా వేసిన సాధారణ ప్రభుత్వ రుణం దశాబ్దం ముగిసేసరికి 78.2శాతానికి తగ్గుతుందని ఆయన అంచనా వేశారు. భారత్‌లో డిజిటల్ విప్లవం ద్వారా వృద్ధి అనేక రెట్లు పెరుగుతుందని కూడా మైఖేల్ వెల్లడించారు.

నమ్మకమే ప్రపంచానికి చోదక శక్తి

- త్వరలో అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణ
- అక్షయ పాత్ర సేవలు ప్రశంసనీయం
- అనంత శేష స్థాపనలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర-తాడేపల్లి: ప్రపంచాన్ని నడిపించే శక్తి నమ్మకమని, దేవుడిపై నమ్మకంతోనే ప్రతి ఒక్కరు నెమ్మదిగా ఉండగలరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ భూమి మీద ప్రార్థనాలయాలు లేకుంటే నేరాలు, ఘోరాలు పేట్రేగి జైళ్లు సరిపోయేవి కాదని అభిప్రాయపడ్డారు. ఏ వృత్తి వారైనా తమకు నచ్చిన దేవుడిని ఆరాధిస్తారని, ఇస్రో శాస్త్రవేత్తలు కూడా ప్రార్థనల తర్వాతే అంతరిక్ష ప్రయోగాలు చేపడతారని తెలిపారు. మాధవ సేవతో పాటు మానవ సేవ చేసే సంస్థ హరేకృష్ణ మూవ్‌మెంట్ అని కొనియాడారు. ధర్మాన్ని కాపాడటానికి విశ్వాసాన్ని కలిగించే ధార్మిక సంస్థలు అవసరమని సీఎం అన్నారు. తాడేపల్లి సమీపంలోని కొలనుకొండలో హరేకృష్ణ గోకుల క్షేత్రంలో వెంకటేశ్వర స్వామి దేవాలయ అనంత శేషస్థాపన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. హరేకృష్ణ మూవ్‌మెంట్‌లో పోటీ పడి ఇస్కాన్ కూడా కార్యక్రమాలను నిర్వహిస్తోందని చంద్రబాబు అన్నారు. ఈ మత సంస్థల్లో ఐఐటీ పట్టభద్రులు అనేక మంది ఉన్నారని తెలిపారు. ఉన్నత చదువులు చదివినప్పటికీ దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటానికి తమ జీవితాలు త్యాగం చేశారన్నారు. హరేకృష్ణ గోకుల క్షేత్రంలో 216 అడుగుల గోపురంతో వెంకటేశ్వరస్వామి, రాధాకృష్ణ దేవాలయం నిర్మిస్తున్నారని తెలిపారు. హరేకృష్ణ మూవ్‌మెంట్...యూపీలో వంద ఎకరాల్లో 700 అడుగుల కృష్ణుడు దేవాలయాన్ని నిర్మించిందని, కొలనుకొండలో 6.5 ఎకరాల్లో దేవాలయాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానానికి తాను ప్రాధాన్యత ఇస్తానని, 25 ఏళ్ల కిందట ఐటీని ప్రోత్సహించానని చంద్రబాబు చెప్పుకున్నారు. తన కుటుంబ ఆరాధ్య దైవం వెంకటేశ్వరస్వామి అని, రోజు రెండు నిమిషాలు దేవుడిని తలచుకుంటానన్నారు. '2003లో తిరుపతిలో 23 క్లైమోర్ మైన్స్ పేలినప్పుడు నాకు ప్రాణభిక్ష పెట్టింది వెంకటేశ్వరస్వామే. మరింత శక్తి, సామర్థ్యాన్ని ఇవ్వాలని, దేశంలో తెలుగువారు నంబర్ వన్ జాతిగా ఉండేలా దీవించాలని కోరుకుంటా' అని అన్నారు. పేదరికం లేని సమాజం మనందరి బాధ్యత కావాలని సీఎం పిలుపునిచ్చారు.

మంచి చేసే వారికి స్పీడ్ బ్రేకర్లు ఉండవు

మధుపండిత్ దాస్ నేతృత్వంలో అక్షయపాత్ర నడుస్తోందని చంద్రబాబు అన్నారు. శ్రీకృష్ణుడి ఆలయ పరిధిలో ఎవరూ ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో లాలా ప్రభుపాద స్ఫూర్తితో అక్షయపాత్ర ప్రారంభమైందని తెలిపారు. 23 ఏళ్లలో 400కోట్ల మందికి భోజనం పెట్టిందని, వివిధ రాష్ట్రాల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశుభ్రంగా, నాణ్యతతో అందిస్తున్నదని, నిత్యం 22 లక్షల మందికి ఆహారం అందిస్తున్నదని చెప్పారు. కృష్ణా పుష్కరాలలో మూడు లక్షల మందికి భోజనం అందించిందన్నారు. అన్న క్యాంటీన్‌లకు భోజన సరఫరా కూడా అక్షయపాత్రకే అప్పగించినట్లు తెలిపారు. '203 అన్న క్యాంటీన్లు నాడు నిర్వహించాం కానీ గత ప్రభుత్వం వాటిని మూయించింది. అన్న క్యాంటీన్లు పునఃప్రారంభిస్తాం. దేశంలో దాతలకు కొదవలేదు.. నమ్మకం అనే వ్యవస్థ ఉండాలి. అక్షయపాత్ర ఆధునిక వసతులతో వంటశాలను నిర్వహిస్తోంది. పెనుకొండలో లక్ష్మీనరసింహా స్వామి 108 అడుగుల విగ్రహాన్ని ఏకశిలా రూపంలో ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు. దానికి కూడా గత ప్రభుత్వం అడ్డుపడింది. వచ్చే ఐదేళ్లు మంచి చేసేవారికి ఎక్కడ స్పీడ్ బ్రేకర్లు ఉండవు.. తరతరాలుగా వస్తున్న వారసత్వాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. హరేకృష్ణ గోకులం, ఇస్కాన్‌కు అండగా ఉండి, సహకరిస్తాం' అని సీఎం చంద్రబాబు అన్నారు.

న్యూఢిల్లీలో జరుగుతున్న సీపీఐ జాతీయ సమితి సమావేశాల్లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జాతీయ కార్యవర్గ, సమితి సభ్యులు.

'విశాఖ స్టీల్' ప్రైవేటీకరణ సరికాదు

రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో సీపీఎం తీర్మానం

విశాలాంధ్ర-విజయవాడ: అనేకమంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల కోసం సీఎం చంద్రబాబు నాయుడు ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించాలని సీపీఎం డిమాండ్ చేసింది. గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని సుందరయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శుక్ర, శని వారాల్లో జరిగిన ఆ పార్టీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో అనేక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎంఏ గఫూర్, డి.రమాదేవి, కె.లోక్‌నాథం, పి.అప్పలనర్స అధ్యక్షవర్గంగా వ్యవహరించిన సమావేశంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఏ బేబీ, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సమావేశానికి హాజరయ్యారు. ఆమోదించిన తీర్మానాలను మీడియాకు వెల్లడించారు. ఉపాధి హామీకి నిధులు పెంచాలని, బకాయిలు చెల్లించాలని, కేంద్ర బడ్జెట్‌లో రూ.రెండులక్షల కోట్లు కేటాయించాలని, టీడీపీ సూపర్ సిక్స్ సత్వరమే అమలు చేయాలని, జీపీఎస్‌ఐ గెజిట్‌ను రద్దు చేయాలని, సీపీఎస్, జీపీఎస్ రద్దు ... పాత పింఛన్ పునరుద్ధరణ, అసభ్య వీడియోలు, చిత్రాలను సోషల్ మీడియాలో నియంత్రణ, యూట్యూబ్ ట్రోలర్స్‌పై చర్యలు, మద్యాన్ని, మత్తు పదార్థాలు, పారిశ్రామిక ప్రమాదాలు అరికట్టాలని, భద్రతా చర్యలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తీర్మానించారు.

సీఐసీకి ఆ అధికారాలున్నాయ్: సుప్రీం

న్యూఢిల్లీ: కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ)కి నిబంధనలను రూపొందించడం, ధర్మాసనాలను ఏర్పాటు చేసేందుకు అధికారమున్నదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ వ్యవస్థ సమర్థంగా పనిచేయాలంటే ఎటువంటి ఆంక్షలు, ఒత్తిళ్లు దీనిపై ఉండరాదని, సీఐసీకి స్వయంప్రతిపత్తి ఎంతో ముఖ్యమని నొక్కి చెప్పింది. పనులను నిష్పాక్షికంగా చేసే నైపుణ్యత కోసం సీఐసీ వంటి సంస్థలు ఏర్పాడతాయని తెలిపింది. ఈ వ్యవస్థల పనితీరులో బాహ్య జోక్యం ఉండరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఢిల్లీ హైకోర్టు 2010, మే 21న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ కమిషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు విచారించింది. సీఐసీ (నిర్వహణ) నిబంధనలు-2007ను హైకోర్టు రద్దు చేసింది. ధర్మాసనాలు ఏర్పాటు చేసే అధికారం సీఐసీకి లేదని తీర్పునిచ్చింది. పరిపాలనా కార్యకలాపాల్లో జోక్యం లేకుండా వ్యవస్థ సమర్థంగా పనిచేయడానికి కమిషన్ స్వయంప్రతిపత్తి ఎంతో ముఖ్యమని సుప్రీంకోర్టు తెలిపింది. సీఐసీని స్వతంత్రంగా పనిచేయనివ్వాలని, ఎలాంటి ఆంక్షలు లేకుండా తనకున్న అధికారాలను ఈ వ్యవస్థ వినియోగించుకోగలగాలని పేర్కొంది. హైకోర్టు తీర్పును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 12 (4) కింద ధర్మాసనాలు ఏర్పాటుకు, నిబంధనలు రూపొందించేందుకు సీఐసీకి అధికారాలు ఉన్నాయని తేల్చిచెప్పింది. ప్రభుత్వ అధికారులు, సంస్థల పారదర్శకతను, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడంతో పాటు పౌరుల సమాచార హక్కుకు హామీనివ్వడమే ఆర్టీఐ చట్టం ముఖ్యఉద్దేశమని సుప్రీంకోర్టు తెలిపింది. ఇవన్నీ సక్రమంగా జరగాలంటే కేంద్ర సమాచార కమిషన్ సమర్థంగా పనిచేయాలని, అందుకోసం విధానపరంగా ఎటువంటి ఆంక్షలు దానిపై ఉండరాదని న్యాయస్థానం పేర్కొంది.

కేంద్ర మంత్రి స్కై డైవింగ్

న్యూఢిల్లీ: వరల్డ్ స్కై డైవింగ్ రోజున కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ స్కై డైవింగ్ చేశారు. భారత దేశంలో ప్రైవేటు రంగంలో మొట్టమొదటి స్కై డైవింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన ఇలా ఉత్సవాలు చేసుకున్నారు. 'భారత్‌తో పాటు ఈ ప్రపంచానికి ఈ రోజు అతిముఖ్యమైనది. హర్యానాలోని నార్నౌల్‌లో ఈ కేంద్రం ఏర్పాటైంది. దేశ పర్యాటక శాఖ మంత్రిగా ప్రజలకు ఈ తరహా సదుపాయాలు అందుబాటులో ఉంచడం నా బాధ్యత' అని షెకావత్ మీడియాతో చెప్పారు. తాను స్కై డైవింగ్ చేసిన చిత్రాలను ఎక్స్(ట్విటర్) వేదికగా షేర్ చేశారు. 'ఆ థ్రిల్‌ను నేనూ ఎంజాయ్ చేశాను. భారత పర్యాటక రంగం అంతర్జాతీయ వసతులు పొందుతున్నందుకు సంతోషంగా ఉంది' అని పోస్టు పెట్టారు. స్కై డైవింగ్ ఎంతో సాహసంతో కూడుకున్న ఓ విన్యాసం. మొదటి, రెండో ప్రపంచ యుద్ధంలో సైనికులు అవసరాన్ని బట్టి ప్యారాచూట్ జంప్ చేసేవారు. ఇటీవలి కాలంలో సామాన్యులు సైతం స్కై డైవింగ్ చేస్తున్నారు.

బీజేపీ న్యాయవ్యవస్థను అవమానించింది

- జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్
- సోనియా, సునీతా కేజ్రీవాల్‌తో భేటీ

న్యూఢిల్లీ: బీజేపీ న్యాయవ్యవస్థను అవమానపరిచిందని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ విమర్శించారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు శుక్రవారం మద్యం పాలసీ కుంభకోణం కేసులో సుప్రీం కోర్టు బెయిల్‌ని మంజూరుచేసినప్పటికీ ఇదే కేసులో ఆయనకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు సీబీఐ కస్టడీని పొడిగించింది. దీంతో కేజ్రీవాల్ జైలులోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఈ పరిణామాలపై సోరెన్ మండిపడ్డారు. ఈ కేసులో అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. హేమంత్ సోరెన్ తన సతీమణి కల్పనా సోరెన్‌తో కలిసి శనివారం ఇక్కడ ఇక్కడి 10 జనపథ్ నివాసంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీని కలిశారు. ఈ సమావేశాన్ని మర్యాదపూర్వక భేటీగా అభివర్ణించిన సోరెన్, లోక్‌సభ ఎన్నికల తర్వాత జైలు నుంచి బయటకు వచ్చినప్పటి నుంచి సోనియా గాంధీని కలవకపోవడంతో తాను గాంధీని కలిసేందుకు వచ్చానని చెప్పారు. జార్ఖండ్‌లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల గురించి గాంధీతో చర్చించారా అని అడిగినప్పుడు 'జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల చర్చలు కొనసాగుతాయి. అయితే ఎన్నికల గురించి ఎటువంటి చర్చ జరగలేదు' అని సోరెన్ చెప్పారు. 'భారతీయులు చాలా సున్నితత్వం, సహనం కలిగి ఉంటారు. అదే వారు సహించలేకపోతే, ఆపై వారు ఓటు ద్వారా తమ వాణిని వినిపిస్తారు' అని సోనియాను కలిసిన తర్వాత విలేకరులతో అన్నారు.

సునీతా కేజ్రీవాల్‌ను కలిసిన సోరెన్ దంపతులు

హేమంత్ సోరెన్, ఆయన సతీమణి కల్పనా సోరెన్ మద్యం పాలసీ కుంభకోణంలో అవినీతి కేసులో జైలులో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్‌ను కూడా కలిశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో జరిగిన ఈ సమావేశానికి ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ కూడా హాజరయ్యారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సమావేశానికి సంబంధించిన వీడియోను 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. దానికి 'నియంతృత్వానికి వ్యతిరేకంగా భారతదేశం ఐక్యంగా ఉంది' అని క్యాప్షన్ ఇచ్చింది. కేంద్ర దర్యాప్తు సంస్థ హేమంత్ సోరెన్, కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన అంశాన్ని లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన నాయకులు ప్రముఖంగా లేవనెత్తారు. కల్పనా సోరెన్, సునీతా కేజ్రీవాల్ కూడా జైలులో ఉన్న తమ భర్తల తరపున ఎన్నికల ప్రచారంలో చేరారు. వారి అరెస్టులకు వ్యతిరేకంగా స్వరాలు లేవనెత్తారు.

జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) కార్యనిర్వాహక అధ్యక్షుడు... భూ కుంభకోణంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జనవరి 31న అరెస్టు చేయడానికి ముందు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. దాదాపు ఐదు నెలల జైలు జీవితం గడిపిన తర్వాత బెయిల్ పొంది జులై 4న మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ, జార్ఖండ్ హైకోర్టు ప్రాథమికంగా ఆయన నేరానికి పాల్పడలేదని, బెయిల్‌పై ఉన్నప్పుడు నేరం చేసే అవకాశం లేదని పేర్కొంది. సోరెన్ నేతృత్వంలోని ప్రభుత్వంలో జేఎంఎం, కాంగ్రెస్‌లు కూటమి భాగస్వాములుగా ఉన్నాయి. ఈ ఏడాది చివరిలో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నా

ఎమర్జెన్సీ తప్పేది కాదు

బీజేపీపై సంజయ్ రౌత్ మండిపాటు

ముంబై: దేశ చరిత్రలో అత్యంత వివాదాస్పదమైన అత్యవసర పరిస్థితి విధించిన జూన్ 25వ తేదీని 'రాజ్యాంగ హత్యా దినం'గా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని శివసేన(ఉద్ధవ్) నేత, పార్లమెంటు సభ్యుడు సంజయ్ రౌత్ తప్పుపట్టారు. ఎమర్జెన్సీని పూర్తిగా సమర్థించారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నా అప్పటి పరిస్థితి ఆధారంగా ఎమర్జెన్సీ విధించి ఉండేవారని రౌత్ అన్నారు. ఎమర్జెన్సీని శివసేన వ్యవస్థాపకుడు బాలాసాహెబ్ ఠాక్రే, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కూడా బహిరంగంగానే సమర్థించినట్లు శనివారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆయన చెప్పారు. 'వారికి (బీజేపీ) మరో పని లేదు. ఇది (ఎమర్జెన్సీ) జరిగి 50 ఏళ్లయింది. ప్రజలు కూడా ఎమర్జెన్సీని మరిచిపోయారు. ఈ దేశంలో ఎమర్జెన్సీ ఎందుకు విధించారు? కొందరు వ్యక్తులు దేశంలో అరాచకవాదాన్ని వ్యాప్తి చేయాలనుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించవద్దని రామ్‌లీలా మైదాన్ నుంచి మన జవాన్లు, ఆర్మీకి పిలుపునిచ్చారు. అలాంటి పరిస్థితిలో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నా... ఆయన కూడా ఎమర్జెన్సీ విధించేవారు. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన అంశం. కొందరు వ్యక్తులు దేశంలో బాంబులు తయారు చేస్తూ వివిధ ప్రాంతాల్లో బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. అమిత్‌షాకు ఎమర్జెన్సీ గురించి ఏమీ తెలియదని నేను చెప్పదలచుకున్నాను. అప్పట్లో బాలాసాహెబ్ ఠాక్రే కూడా ఎమర్జెన్సీకి మద్దతుగా నిలిచారు. ఆర్ఎస్ఎస్ సైతం మద్దతిచ్చింది' అని సంజయ్ రౌత్ తెలిపారు. 'శివసేన నేత బాలాసాహెబ్ ఠాక్రే సైతం 1975 ఎమర్జెన్సీని, ఇందిరాగాంధీని బహిరంగంగానే సమర్థించారు. ముంబైలో ఆమెకు స్వాగతం పలికారు. దేశంలో అరాచకవాదాన్ని అదుపు చేయడానికి ఎమర్జెన్సీ అవసరమని బాలాసాహెబ్ భావించారు. అందులో తప్పేముంది? బీజేపీ పదేళ్ల పాలనలో జరిగిందేమిటి? వాళ్లు రాజ్యాంగ పరిరక్షకులు కూడా కాదు' అని సంజయ్ రౌత్ వివరించారు. ఎమర్జెన్సీ సమయంలో రాజ్యాంగాన్ని హత్య చేశారని వాజ్‌పేయి భావించలేదని గుర్తుచేశారు. ఆ తర్వాతే వాజ్‌పేయి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. రాజ్యాంగాన్ని హత్య చేశారని అటల్‌జీనే అననప్పుడు వాళ్లెవరని బీజేపీని ప్రశ్నించారు. చేసేందుకు పనేమీ లేకపోవడం వల్లే బీజేపీ నేతలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, ఎమర్జెన్సీ గురించి మాట్లాడదలిస్తే మోదీ పదేళ్ల పాలనలో ప్రతిరోజూ ప్రజాస్వామ్యం హత్యకు గురవుతున్న విషయాన్ని గుర్తుచేసుకోవాలని సంజయ్ రౌత్ స్పష్టం చేశారు.

ఇటలీలో బానిసత్వం నుంచి 33 మంది భారతీయులకు విముక్తి

రోమ్: భారత్‌కు చెందిన 33 మంది కార్మికులకు బానిసత్వం నుంచి విముక్తి లభించింది. ఉత్తర వెరోనా ప్రావిన్స్‌లో బానిసత్వం తరహా పరిస్థితుల్లో ఉన్న వ్యవసాయ కార్మికులను ఇటలీ పోలీసులు కాపాడారు. ఈ కార్మికులను వేధించే ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి అర మిలియన్ యూరోలు అంటే 5,45,300 డాలర్లను స్వాధీనం చేసుకున్నారు. జూన్‌లో భారత్‌కు చెందిన ఓ కార్మికుడి చెయ్యి ప్రమాదవశాత్తు తెగిపోయిన ఘటనలో అతను ప్రాణాలు కోల్పోయాడు. ఆ తర్వాత నుంచి శ్రమదోపిడీపై ఇటలీ యంత్రాంగం దృష్టి పెట్టింది. తాజా కేసులో గ్యాంగ్ మాస్టర్లు కూడా భారత్‌కు చెందిన వారని, సీజనల్ వర్క్ పర్మిట్లపై దేశానికి తెచ్చారని, మెరుగైన భవిష్యత్ ఆశ చూపి వారి నుంచి 17వేల యూరోలు తీసుకున్నారని పోలీసులు తెలిపారు. పొలం పని అప్పగించి రోజుకు 10-12 గంటలు చొప్పున వారానికి ఏడు రోజులు పనిచేయిస్తూ గంటకు 4 యూరోలు లెక్కన నామమాత్రంగా చెల్లిస్తున్నారని, అవి కూడా అప్పు కింద జమచేసుకుంటున్నారని పోలీసులు వెల్లడించారు. శాశ్వత వర్క్ పర్మిట్ కోసం అదనంగా 13వేల యూరోలు ఇవ్వాలని, ఆ డబ్బు జమయ్యేంత వరకు ఉచితంగా పనిచేయాలని కొందరిని పునమాయించారన్నారు. వాస్తవానికి పర్మిట్లు ఇచ్చే ఉద్దేశం మాస్టర్లకు లేదని చెప్పారు. బాధితులకు రక్షణ, చట్టబద్ధంగా రెసిడెన్సీ పత్రాలు, పని అవకాశాలు కల్పిస్తామన్నారు. నిందితులపై బానిసత్వం, శ్రమదోపిడీ కింద కేసు పెట్టినట్లు తెలిపారు.

ఢిల్లీకి ధరల సెగ!

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ వాసులకు ధరల సెగ తగిలింది. వర్షం కారణంగా హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో పంట నష్టంతో దేశ రాజ ధానిలో కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. వినియోగదారులు టమాటాలు వంటి నిత్యావసరాలను రెట్టింపు ధరకు కొనుగోలు చేయవలసి వచ్చింది. బంగాళదుంపలు, ఉల్లిపాయలు, టమాటాలతో పాటు కాలీఫ్లవర్, క్యాబేజీ పొట్లకాయ వంటి పచ్చి కూరగాయల ధరలు ముఖ్యంగా పెరిగాయని హోల్‌సేల్ మార్కెట్‌లలో విక్రేతలు తెలిపారు. ప్రస్తుతం టమాటా టోకు ధర కిలో 50 నుంచి 60 రూపాయలు పలుకుతోంది. స్థానిక రకం 28 కిలోలు (1 క్రేట్) 1,200 రూపాయలకు, హైబ్రిడ్ రకం 1,400 నుంచి 1,700 రూపాయలకు విక్రయిస్తు న్నారు. ఇంతకుముందు వీటిని దాదాపుగా కిలో రూ.25 నుంచి 30కు విక్రయించేవారు' అని ఆజాద్‌పూర్ సబ్జీ మండి వ్యాపారి సంజయ్ భగత్ తెలిపారు. 'హోల్‌సేల్ మార్కెట్‌లో ఇతర కూరగాయల ధర కిలో 25 నుంచి 28 రూపాయలు. 10 నుంచి 15 రూపాయలకు విక్రయించే కూరగాయలు ఇప్పుడు రూ.25 నుంచి 30 వరకు ఉన్నాయి. బీన్స్ ధరలు కూడా పెరిగి, కిలో 40 నుంచి 50 రూపాయలకు అమ్ముతున్నారు' అని ఆయన అన్నారు. చాలా మంది సరఫరాదారులు హిమాచల్ ప్రదేశ్ నుంచి టమాటాలు పొందుతున్నారని. అయితే అక్కడ పంట ఎండిపోయిందని భగత్ చెప్పారు. పర్వత ప్రాంతాల్లోని పంటలు వర్షంపైనే ఆధారపడి ఉన్నాయని, ఈసారి వాతావరణం చాలా వేడిగా ఉందని, చాలా తక్కువ వర్షం పడిందని, దీంతో మొక్కలు ఎండిపోయి చీడపీడల బారిన పడుతున్నాయని చెప్పారు. ఎండిపోయి భారీ వర్షం కురవడంతో పంటలు మరింత దెబ్బతిన్నాయి. 'ప్రస్తుతం సరఫరా తక్కువతోపాటు నాణ్యత తక్కువగా ఉంది' అని భగత్ వివరించారు. ప్రస్తుతం కర్నాటక, హిమాచల్ ప్రదేశ్‌ల నుంచి మాత్రమే టమాటాలు సరఫరా అవుతున్నాయి. అంచనాల ప్రకారం, మహారాష్ట్ర నుంచి వచ్చే కొత్త పంట ఆగస్టు 10 నుంచి 15 వరకు వచ్చే వరకు ధరలు ఎక్కువగానే ఉంటాయని ఓఖ్లా సబ్జీ మండిలోని మరో వ్యాపారి తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.